ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 17.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 356 పేజీలు: 12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

గేల్ రికార్డ్ బద్దలు కొడుతా 12

తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం

రేవంత్ తెలంగాణను అవమానిస్తున్నారు

- మేం అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాన్ని గాంధీ భవన్ కు తరలిస్తాం
- అసెంబ్లీలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టిస్తాం
- బతుకమ్మ లేని విగ్రహం తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదు
- సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తెలంగాణకే గర్వకారణం
- విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం
- వెంటనే ఆయనను విడుదల చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 16: తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేసే పని చరిత్రను చెరిపి వేయడమే అన్నారు. అది కుదరకపోతే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రస్తుతం అదే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో సోమవారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంపై కవిత స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన ఆ విగ్రహం తెలంగాణ చరిత్రను అమానించేలా ఉందన్నారు. బతుకమ్మ లేకుండా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ఎంత మాత్రం కూడా ప్రతిరూపం కాదని చెప్పారు. సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని తెలిపారు. తమ మూలాలను మదిలో తలుస్తూ తెలంగాణ బిడ్డలంతా ఉద్యమ సందర్భంలో తెలంగాణ తల్లికి అపురూపంగా ఇచ్చిన రూపమే బతుకమ్మతో కూడిన తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉద్యమ కాలంలో ఏర్పరచుకున్న తల్లి రూపురేఖలు మార్చడం, ఉద్యమ గుర్తులను చెరిపి వేయడం మూర్ఖపు పని అని పేర్కొన్నారు. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపుతున్నానని రేవంత్ రెడ్డి అల్ప సంతోషంలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక... అమరుల త్యాగాలను ఒడిసి పట్టుకున్న ఉద్యమ తెలంగాణ తల్లిని అదే చోట ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా కాంగ్రెస్ కు ఆఫీస్ కు తరలిస్తామని తేల్చిచెప్పారు.

విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం

ఖమ్మం వెలుగుమట్ల బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ను పోలీసులు అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

...:: మిగతా 2లో

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

విజన్-2047తో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్

- సామాజిక న్యాయం, పారదర్శక పాలనపై దృష్టి
- 'తెలంగాణ రైజింగ్–2047'తో సమగ్ర అభివృద్ధి లక్ష్యం
- సంస్కృతి – సంప్రదాయాలకు ప్రాధాన్యం
- రికార్డు స్థాయిలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణతో పాలన బలోపేతం
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 16 : ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం

...:: మిగతా 2లో

శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్

...:: 5లో

అసెంబ్లీకి సభ్యులు కచ్చితంగా రావాలి

- రాష్ట్ర స్థాయి విషయాలు మాట్లాడొద్దు
- అనవసరపు కాంట్రవర్సీలు వద్దు
- మూడు సార్లు అటెండెన్స్ తీసుకుంటాం
- బీఆర్ఎస్ నేతల నెగిటివ్ మాత్రమే కాదు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

...:: 5లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.32 (మంగళవారం సాయంత్రం)

సహర్ – 5.00 (బుధవారం ఉదయం)

గుజరాత్ తీరం చేరిన ఎల్పీజీ నౌక

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్‌లో నెలకొన్న వంట గ్యాస్ కష్టాలకు కాసింత తెరపడనుంది. గ్యాస్ కోసం తిప్పలు పడుతున్న కోట్లాదిమందికి ఊరటనిస్తూ భారీ లోడుతో ఎల్పీజీ ట్యాంకర్ శివాలిక్ సోమవారం గుజరాత్ తీరానికి చేరుకుంది.

11

గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ గ్యాస్

దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందని, త్వరలోనే గ్యాస్ సిలిండర్ ధర రూ.2,000 దాటుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ ప్రచారానికి తెరదించేందుకు కేంద్రం కీలక ప్రకటన చేసింది.

11

దీదీని ఓడించడమే లక్ష్యం

బెంగాల్ ఎన్నికలలో అధికార టీఎంసీపై ఒత్తిడి పెంచే పవర్ ఫుల్ వ్యూహాన్ని కమలదళం అమలు చేస్తోంది. ఈక్రమంలోనే సోమవారం విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారికి ఏకంగా రెండు సీట్లను కేటాయించింది.

11

రాహుల్‌కు వెయ్యి కోట్లు.. రైతులకు వెన్నుపోటా?

- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?
- రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయండి
- తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంగా మార్చారు
- మహిళలకు ₹2500, వృద్ధులకు ₹4000 ఎక్కడ?
- రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?
- హామీలన్నీ మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 16: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పక్కన పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. శాసనసభ సమావేశాలకు ముందు తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించే ఆనవాయితీని కొనసాగిస్తూ భారత రాష్ట్ర సమితి శాసనసభ పక్షం సభ్యులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో

...:: మిగతా 2లో

నందిని సిధారెడ్డికి సాహిత్య అకాడమీ పురస్కారం

- 'అనిమేష' గ్రంథానికి గాను ఈ అవార్డు ప్రకటన
- తెలంగాణకు గర్వకారణం: సీఎం రేవంత్
- తెలంగాణ గర్వించదగ్గ కవి: మాజీ సీఎం కేసీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 16: ప్రజాకవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కోవిడ్19 సమయంలో సమాజంలోని వేదన, భయం, మానవీయ కోణాలను వ్యక్తపరుస్తూ సిధారెడ్డి రచించిన 'అనిమేష' గ్రంథానికి గాను ఈ అవార్డు

...:: మిగతా 2లో



బందారంలో విరిసిన మందారం

...:: 11లో

రాష్ట్ర ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెట్టారు



- నదీ జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం
- నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- నీటి హక్కులు కాపాడేందుకు బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కృషి
- బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్ర హక్కులను కాపాడాం
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు

...:: 2లో

ప్రపంచ దేశాల్లో ఇంధన ఆందోళన

- హర్ముజ్ వద్ద ఉద్రిక్తతలు యథాతథం
- యుద్ధ నౌకలను పంపండి: ట్రంప్
- ట్రంప్‌కు మిత్రదేశాల షాక్
- యుద్ధనౌకలు పంపేదుకు నిరాకరణ
- హర్మూజ్‌లో సైనిక చర్యలు ఆపండి: చైనా
- ఖర్గ్ దీవి స్వాధీనానికి ట్రంప్ యోచన
- ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ముమ్మరం
- దుబాయ్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ డ్రోన్ దాడి
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- మోదీ పర్యటన ముగిశాకే దాడులకు అవకాశం
- భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి ర్యూవెన్ అజర్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపంలోకి మారుతుండడంతో ప్రపంచ దేశాలలో ఇంధన సంక్షభంపై భయాందోళనలు పెరిగిపోతున్నాయి. ఇరాన్ రాజధానిపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభంపై భయాందోళనలు తీవ్రమవుతున్నాయి. ప్రపంచ పర్యాటక గమ్యస్థానాల్లో ఒకటైన దుబాయ్ విమానాశ్రయంపై

...:: మిగతా 2లో

తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం

మొదటిపేజీ తరువాయి

కల్వకుంట్ల కవిత ఖండించారు. ఈ అరెస్ట్ అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన విశారదన్ మహరాజ్ ను పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బంది పెట్టటం దారుణమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకే గర్వకారణం

ప్రముఖ కవి, అధ్యాపకులు నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఎంతో సంతోషానిచ్చిందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన ఆయనకు ఈ అవార్డు రావటం తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. వచన కవిత్వ విభాగంలో నందిని సిధారెడ్డి గారు రచించిన "అనిమేష" కవితా సంపుటికి పురస్కారం లభించడం అభినందనీయమని అన్నారు. ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షించారు.

నందిని సిధారెడ్డికి సాహిత్య అకాడమీ పురస్కారం

మొదటిపేజీ తరువాయి

ప్రకటించినట్లు అకాడమీ తెలిపింది. ఈ నెల 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాలకు చెందిన కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు , ప్రధాన అడ్మిన్ కవయిత్రి అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు శ్రీలక్ష్మి, ములస్తం లావణ్య, కటుకం కవిత, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్, డా. శ్యామ్ సుందర్, రుద్రాంగి కమల, రుద్ర మాణిక్యం, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె.రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, మరసం కవులు హర్షం వెలిబుచ్చారు. నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు హర్షం ప్రకటించారు.

తెలంగాణకు గర్వకారణం: సీఎం రేవంత్

తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డి గారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి గారు రాసిన "అనిమేష" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి గారు కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి గారి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో నందిని సిధారెడ్డి గారు ఎన్నో పరిశోధనాత్మక రచనలతో సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాహితీ రంగంలో సిధారెడ్డి గారు మరెన్నో శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ గర్వించదగ్గ కవి: కేసీఆర్

కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత సాహిత్య పురస్కారం..ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్ధారెడ్డి కి దక్కడం పట్ల, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా నందిని సిద్ధారెడ్డిని అభినందిస్తూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కున్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి.. 'అనిమేష' కు ఈ అవార్డు రావడం గొప్ప విషయం అని కేసీఆర్ అన్నారు. తెలంగాణ మట్టి వాసన తెలిసిన కవిగా, తన సాహిత్యం ద్వారా తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిన, తెలంగాణ గర్వించదగ్గ కవి, నందిని సిద్ధారెడ్డి అని కేసీఆర్ అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘం ఏర్పాటుచేసి, అన్ని వర్గాల ప్రజా సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేస్తూ తమ కలాన్ని గళాన్ని విప్పారని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన పాట సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని సిద్ధారెడ్డి చూరగొన్నారని కేసీఆర్ తెలిపారు.

..రైతులకు వెన్నుపోటా?

మొదటిపేజీ తరువాయి

మాట్లాడిన కేటీఆర్, తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. మొదటి గవర్నర్ ప్రసంగంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించిందని, అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ద్వారా కూడా అదే చెప్పించారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు చట్టబద్ధత కల్పించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇది మూడో గవర్నర్ ప్రసంగం అయినప్పటికీ ఇప్పటికీ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఇవ్వలేదని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పంటలు నాటే సమయానికే రైతుబంధు అందేదని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పంటలు కోతకు వచ్చినా రైతుబంధు డబ్బులు రైతులకు అందలేదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని అన్నారు. అందుకే "రాహుల్ బంధు కాదు, రైతుబంధు వేయండి", "రాహుల్‌కు వెయ్యి కోట్లు.. రైతులకు వెన్నుపోట్లా?" అనే నినాదాలతో శాసనసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పారని, ఇప్పటివరకు దాదాపు 60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా ఆ విషయంపై కూడా స్పష్టత లేదన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం అంబేద్కర్ అభయహస్తం పథకం తీసుకొస్తామని, దళితబంధు స్థానంలో ఒక్కో కుటుంబానికి 12 లక్షలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని తెలిపారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క స్పష్టత కూడా ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారెంటీల అమలు పూర్తిగా నిలిచిపోయినట్లే కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు రూ.2,500 ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని, వృద్ధులు రూ.4,000 పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతులు రైతుభరోసా, రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారని, రైతు కూలీలు నెలకు ఇస్తామని చెప్పిన రూ.1,000 కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఆటో డ్రైవర్లు కూడా ప్రకటించిన ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10,000 కోట్లకు చేరుకున్నాయని, వాటిని కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఉద్యోగాలు కనిపించడం లేదని విమర్శించారు. ఈ అన్ని అంశాలపై శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తామని కేటీఆర్ చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థికంగా బలంగా నిర్మించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించారని, కానీ ఇప్పుడు ఆర్థిక అరాచకం జరుగుతోందని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులకు కనీస బెనిఫిట్స్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణను ఒక ఏటీఎంగా మార్చి ఏఐసీసీకి సమర్పించుకునే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ, ఈ రాష్ట్రంలోని పేదల సమస్యలపై లేదని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, నిగ్గదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



అమెరికా ట్విన్ టవర్స్‌పై అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ దాడి చేస్తాడని ముందే ఊహించా. ఏడాది ముందే నేను ఓ బుక్‌లో ఈ విషయాన్ని రాశా. ఒకసారి లాడెన్ ఇంటర్వ్యూ చూసి అతడు చెడ్డ వ్యక్తి, పట్టుకోవాలని చెప్పా. అప్పటి ప్రెసిడెంట్ క్లింటన్ అతడిని చంపేయాల్సింది. కానీ అలా చేయలేదు. హార్ముజ్‌ను ఇరాన్ ఆయుధంగా మారుస్తుందని కూడా తాను ముందే అంచనా వేశా.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

మొదటి పేజీ తరువాయి

అందిస్తోందని తెలిపారు. ప్రపంచానికే దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని అన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ ఫలితాలు అందరికీ అందేలా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కోర్, ప్యూర్, రేర్‌గా విభజించామని, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధన దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసే విధంగా రాష్ట్రంలో కుల సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 59 ఎస్సీ కులాల రిజర్వేషన్ వర్గీకరణను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాల నుంచి విముక్తి చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పునరుద్ధరించి రికార్డు సమయంలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు గవర్నర్ తెలిపారు. ఈ చర్యలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

సంస్కృతి – సంప్రదాయాలకు ప్రాధాన్యం

తెలంగాణ సంస్కృతి, కళా వారసత్వాన్ని కాపాడటంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని గవర్నర్ పేర్కొన్నారు. సినిమా రంగంలో ప్రతిభను గుర్తించేందుకు గద్దర్ ఫిలీం అవార్డులను ప్రారంభించినట్లు చెప్పారు. అలాగే దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పుణ్యక్షేత్రాల అభివృద్ధి చేపట్టడమే కాకుండా వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సంస్కరణలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా వివరించారు. రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ అమలవుతోందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత రెండేళ్లలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అనేక చర్యలు చేపట్టామని చెప్పారు.

మెట్రోపాలిటన్ పాలన బలోపేతం

వేగంగా పట్టణీకరణ జరుగుతున్న నేపథ్యంలో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విభజించినట్లు గవర్నర్ తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతాన్ని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా అభివృద్ధి చేస్తూ మెట్రోపాలిటన్ పరిపాలనను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.సరస్సులు, చెరువులు, ట్యాంకులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. హైడ్రా చర్యల ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మూసీ రివర్ ఫ్రంట్ – ఫ్యూచర్ సిటీ ప్రణాళిక

హైదరాబాద్‌ను ఆధునిక నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 55 కి.మీ. మేర మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని మాన్యుఫాక్చరింగ్, ఎంఎస్ఎంఈలు, లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోందని తెలిపారు. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయడం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణేలకు హైస్పీడ్ రైలు మార్గాలు వంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.

రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందంజలో ఉందని గవర్నర్ అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయోఏషియా సమ్మిట్ ల ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్లు వెల్లడించారు. ఎగుమతుల్లో దేశంలో తెలంగాణ 7వ స్థానంలో నిలిచిందని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని తెలిపారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా...

ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, 3.38 కోట్ల మందికి ప్రతి నెల 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు పథకంలో రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పథకం అమలవుతోందని పేర్కొన్నారు. మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు 269.68 కోట్ల జీరో టికెట్లు జారీ చేసి, రూ.9,222 కోట్లకు పైగా ఆదా కల్పించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో 42.9 లక్షల కుటుంబాలకు రూ.500కు ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకంలో 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతున్నట్లు తెలిపారు.

విద్య – ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం..

విద్యా రంగంలో సంస్కరణల కోసం కమిటీ ఏర్పాటు చేసి కొత్త విధానాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు గవర్నర్ వెల్లడించారు. వరంగల్ హెల్త్ సిటీ, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా కొత్త ఆసుపత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల ఏర్పాటు వంటి ప్రాజెక్టులు త్వరలో పూర్తవుతాయని చెప్పారు.

సామాజిక న్యాయం – పారదర్శక నియామకాలు..

సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి కుల సర్వే నిర్వహించామని, 59 ఎస్సీ కులాల రిజర్వేషన్ వర్గీకరణ పూర్తిచేసినట్లు తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం పీఎస్సీని పునరుద్ధరించి రికార్డు స్థాయిలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు

సభలో బీఆర్ఎస్ నిరసన

శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు

రాష్ట్ర ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెట్టారు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని, బాధ్యతలేని వైఖరి వల్ల తెలంగాణ నీటి హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని ఆరోపించారు. సమైక్య రాష్ట్రంలో నీళ్ల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నిరంతరం కృషి చేశారని హరీశ్ రావు గుర్తుచేశారు. కృష్ణా నదిలో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు కృష్ణా ట్రిబ్యునల్‌ను సాధించి నీటి పునఃపంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే గోదావరి నదిలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణకు ఉన్న హక్కులను శాశ్వతంగా కాపాడామని చెప్పారు.

తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు

గోదావరిలో ఉన్న 1400 టీఎంసీల నీటిలో 968 టీఎంసీలు తెలంగాణకు, 518 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారని తెలిపారు. తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల హక్కులను స్థిరపరచడానికి యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టులు నిర్మించి, 400 టీఎంసీల ప్రాజెక్టులకు అనుమతులు సాధించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ కూటమి ప్రభుత్వం కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా నదిలో ఇప్పటికే నీటి దోపిడీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని గోదావరి జలాలపై కన్నేసిందన్నారు. తాను ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నించినందుకే సాయంత్రానికి మళ్లీ కేంద్రానికి లేఖ రాయవచ్చని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జనవరి 30న ఢిల్లీలో రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారుల సమావేశం జరిగిందని, ఆ సమావేశం ద్వారా తెలంగాణ నీటి హక్కులను హరించేందుకు ఆంధ్రప్రదేశ్ పక్కా స్కెచ్ వేసిందని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ మద్దతుతో గోదావరి నీళ్లను దోచుకునేందుకు టీడీపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. గోదావరిలో ఏ రాష్ట్రానికీ బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయలేదని ఏపీ వాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫిబ్రవరి 12న ఢిల్లీ సమావేశానికి సంబంధించిన మినిట్స్ రాష్ట్రానికి వచ్చినప్పటికీ, మార్చి 16 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అనుమానాస్పదమని హరీశ్ రావు అన్నారు. అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

దొంగ చేతికే తాళాలు ఇచ్చారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాకట్టు పెట్టారా లేదా దాసోహం అయ్యారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. గోదావరి, బనకచర్ల అంశాలు ఎజెండాలో లేకపోతేనే ఢిల్లీ సమావేశానికి వెళ్తామని ముందుగా చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, పోలవరం, నల్లమల్ల సాగర్ అంశాలను ఏపీ ఎజెండాలో చేర్చినా కూడా ఆ సమావేశానికి వెళ్లి కూర్చోవడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం చేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను చైర్మన్‌గా చేసి దొంగ చేతికే తాళాలు ఇచ్చినట్టుగా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సీతారామ ప్రాజెక్టుకు అనుమతులు తీసుకువచ్చామని, అప్పట్లో ఏపీకి ఉన్న 531 టీఎంసీల వాటాను పరిగణనలోకి తీసుకునే సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీలకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చిందని చెప్పారు. జూన్ 2023లో సెంట్రల్ వాటర్ కమిషన్ ఇచ్చిన నివేదికలో గోదావరిలో 3396 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని, అందులో ఏపీ వాటా పోయిన తర్వాత మిగిలిన నీరు తెలంగాణకే చెందుతుందని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఏకంగా 775 టీఎంసీలు కావాలని డిమాండ్ చేస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కృష్ణా నదిలో కనీసం 34 శాతం తాత్కాలిక వాటాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుకోలేకపోతుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఢిల్లీ సమావేశ మినిట్స్‌పైనా స్పందించడంలేదని, గవర్నర్ ప్రసంగంపైనా మాట్లాడడం లేదని అన్నారు. కృష్ణా నదిలో 80 శాతం నీళ్లు ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతున్నా ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. కృష్ణాతో పాటు గోదావరి నీళ్లను కూడా ఆంధ్రప్రదేశ్ దోచుకుపోకుండా ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే ఢిల్లీ సమావేశ మినిట్స్‌పై గట్టిగా అభ్యంతరం తెలపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

ప్రపంచ దేశాల్లో ఇంధన ఆందోళన

మొదటిపేజీ తరువాయి

ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలు వెలువడినట్లయింది. గత రెండు వారాలకు పైగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండగా పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ రక్షణ స్థావరాలు, గల్ఫ్ అరబ్ దేశాలకు చెందిన ఇంధన స్థావరాలపైన ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరుపుతున్నది. హర్ముజ్ జలసంధిలో, చుట్టుపక్కల వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు జరపడం, దాడులకు సంబంధించి ఇరాన్ చేస్తున్న హెచ్చరికలతో ఆ ప్రాంతంలో వాణిజ్య నౌకల రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడంతో ఈ సంక్షోభాన్ని పరిష్కరించాలంటూ అమెరికాపై ఒత్తిడి అధికమవుతున్నది. సోమవారం బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్ 100 డాలర్ల మేరకు ఉంది.

దుబాయ్ ఎయిర్‌పోర్టుపై దాడి

ప్రపంచంలోనే అంతర్జాతీయ ప్యాసింజర్ ట్రాఫిక్‌తో అత్యంత బిజీగా ఉండే దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఇంధన ట్యాంకుపై సోమవారం ఉదయం ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని తెలుస్తున్నది. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత యూఏఈ రాజధాని అబూ ధాబిలో ఓ ఇరాన్ క్షిపణి ఓ వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మరణించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఏడు ఎమిరేట్స్‌లో ఒకటైన ఫుజైరాలోని ఓ చమురు స్థావరంపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి మంటలు చెలరేగాయి. చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన 35 డ్రోన్లను అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా సైనిక స్థావరాలకు ఆశ్రయమిస్తున్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ ఇప్పటివరకు కొన్ని వందల క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది.

హర్ముజ్ వద్దకు యుద్ధ నౌకలను పంపండి: ట్రంప్

హర్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. మిత్రదేశాలు తమ యుద్ధ నౌకలను జలసంధి వద్దకు పంపాలని ఇచ్చిన పిలుపునకు స్పందన రాలే దు. ధరల పెరుగుదల అమెరికన్లను బాధిస్తే అది రానున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లపై ప్రభావం చూపగలదని ట్రంప్ భయపడుతున్నారు. హర్ముజ్ తెరిచేందుకు యుద్ధ నౌకల ను పంపాలని కోరినట్లు ఆదివారం వెల్లడించిన ట్రంప్ తన పిలుపును తిరస్కరించిన దేశాలను గుర్తుపెట్టుకుంటానని కూడా హెచ్చరించారు.

బీరుట్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

లెబనాన్ రాజధాని బీరుట్ పై ఇజ్రాయెల్ సోమవారం భీకర దాడులు జరిపింది. హిజ్బొల్లా తీవ్రవాద గ్రూపును లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. బీరుట్ తోపాటు దక్షిణ లెబనాన్‌లోని అనేక నగరాల ప్రజలను ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెలీ సైన్యం ఆదేశించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడుల కారణంగా ఇప్పటివరకు 8 లక్షల మందికిపైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెలీ దాడుల్లో ఏడుగురు మరణించినట్లు లెబనాన్ అధికారులు చెప్పారు. ఇరాన్‌లో ఆదివారం రాత్రి నుంచి అమెరికా, ఇజ్రాయెల్ దళాల దాడులు కొనసాగుతున్నాయి. ఇంటర్నెట్ ను ఇరాన్ నిలిపివేసి జర్నలిస్టులపై ఆంక్షలు విధించింది.

హర్మ్యాజ్‌లో సైనిక చర్యలు ఆపేయండి-: చైనా

హోర్ముజ్ జలసంధి నుంచి ఇంధన రవాణా క్రమబద్ధీకరణకు ప్రపంచ దేశాలు ముందుకు రావాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపుపై చైనా స్పందించింది. హోర్ముజ్ జలసంధి రక్షణకు ముందుకు రావాలంటే పశ్చిమాసియాలో జరుగుతున్న సైనిక చర్యలను తక్షణమే ఆపేయాలని కోరింది. ఉద్రిక్తతలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా టారిఫ్ నిర్ణయాలు ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని చైనా సోమవారం హెచ్చరించింది. పారిస్‌లో జరిగిన ఉన్నత స్థాయి చర్చల ముగింపు సందర్భంగా చైనా ఈ వ్యాఖ్యలు చేసింది. ఇరాన్ పరిధిలోని హర్మ్యాజ్ జలసంధిలో మోహరింపు కోసం యుద్ధనౌకలను పంపాలంటూ ఆయన చేసిన సూచనను పలు మిత్ర దేశాలు తిరస్కరించాయి.

ప్రధాని మోదీ పర్యటన ముగిశాకే..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన వెంటనే, ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడి చేయడంపై వెలువడుతున్న ఊహాగానాలపై భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి ర్యూవెన్ అజర్ స్పష్టత ఇచ్చారు. వాస్తవానికి ప్రధాని మోదీ ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్ పర్యటనకు రావడానికి ముందు నుంచే పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితి అస్థిరంగా ఉందని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడి సమయం విషయానికొస్తే, ప్రధాని మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాకే తమకు ఆ అవకాశం లభించిందన్నారు. సోమవారం ఢిల్లీలో విలేకరుల సమావేశం వేదికగా ఈవివరాలను ర్యూవెన్ అజర్ వెల్లడించారు.

రాజకీయం

31 వరకు అసెంబ్లీ సమావేశాలు

- బడ్జెట్ సమావేశాల నిర్వహణపై బీఏసీలో నిర్ణయం
- 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు
- మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. నేడు, రేపు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు

22న నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం

- ఏర్పాట్లు ముమ్మరం చేయండి
- రైతుల సందర్శనార్థం రైతు మేళా నిర్వహణ
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- అధికారులతో సమీక్షా సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొన్నం, వాకిటి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరగనున్న సందర్భంగా, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేసి, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు, తద్వారా పెద్ద సంఖ్యలో రైతులు కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం కల్పించాలని అన్నారు. అదేవిధంగా ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రైతుల సందర్శనార్థం మార్చి 20 నుంచి 22 వరకు రైతు మేళాను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేళాలో రైతులకు ఉపయోగపడే విధంగా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, కేవలం వ్యవసాయ శాఖకు సంబంధించిన స్టాల్స్ మాత్రమే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలు మరియు పశు సంవర్ధక శాఖకు సంబంధించిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. స్టాల్స్ మార్చి 20వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని, అలాగే 22వ తేదీన గౌరవ ముఖ్యమంత్రిగారు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి, రూ.80 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పామ్ రిఫైనరీకి శంకుస్థాపన చేస్తారని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ స్టాల్స్ ద్వారా రైతులకు అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆయిల్ పామ్ సాగు మరియు ప్రాసెసింగ్ విధానాలపై సమగ్ర సమాచారం అందించాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే ఆయిల్ పామ్ సాగులో విజయం సాధించిన రైతుల విజయగాథలను రైతులకు పరిచయం చేయాలని, తద్వారా ఇతర రైతులకు ప్రేరణ కలిగేలా చూడాలని సూచించారు. అదేవిధంగా ఆదర్శ రైతులు మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా చర్చించే విధంగా డైరెక్ట్ ఇంటరాక్షన్ కార్యక్రమం కూడా నిర్వహించాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొనేలా తగిన ఏర్పాట్లు చేయాలని, అలాగే ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానాలు అందించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను అవమానించారు

- బీఆర్ఎస్ నేతల స్పర్శతో అమరవీరుల స్థూపం అపవిత్రమైంది
- పాలతో శుద్ధి చేసిన ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్
- అమరవీరుల స్థూపం వద్ద ఉద్రిక్తత

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16 : తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఉదయం తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులు అర్పించేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అయితే అనంతరం అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకుల స్పర్శతో అమరవీరుల స్థూపం అపవిత్రమైందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అమరవీరుల స్థూపాన్ని పాలతో శుద్ధి చేశారు. పాలతో స్థూపాన్ని కడిగి అమరవీరులకు తిరిగి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను అవమానించేలా బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ఆత్మను కాపాడటానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనతో అమరవీరుల స్థూపం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో చర్చనీయాంశంగా మారింది.

సిద్దిపేటలో విశాల షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చ్ 16: సిద్దిపేట పట్టణంలోని బురుజు రోడ్డులో విశాల షాపింగ్ మాల్ ను ఒంప్రకాశ్ జి జాజు చేతుల మీదుగా ప్రారంభించారు. సినీనటి నిధి అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాల షాపింగ్ మాల్ ప్రారంభించుకోవడం చాలా సంతోషం అన్నారు. సినీనటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ విశాల షాపింగ్ మాల్ లో మంచి వెరేటి చీరలు, చిన్నపిల్ల బట్టలు, మెన్స్ వేర్ చాలా వెరిటీలు వున్నాయి. మా విశాల కస్టమర్ల కోసం మంచి మంచి ఆపర్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ యజమాని వేముల విష్ణు, శ్రీనివాస్ , వెంకటేశ్వర్లు, వేణు గోపాల్ జాజు, నవనిత్ బంగ్ , శ్రీరామ్ జాజు, శ్రీధర్,నాగరాజు, దేవరాజు, నందరాజ్ , కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్, తదితరులు ఉన్నారు.

స్త్రీనిధి కార్యకలాపాలు పారదర్శకంగా కొనసాగాలి

- అవినీతి, అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు
- పత్రికల్లో వచ్చిన వార్తలపై వెంటనే రిపోర్ట్ఇవ్వాలి
- స్త్రీనిధి కార్యకలాపాలపై మంత్రి సీతక్క సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: స్త్రీనిధి కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగాలని అధికారులకు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంస్థపై తప్పుడు ప్రచారాలు జరిగితే వాటిని తక్షణమే ఖండిస్తూ సరైన సమాచారం ప్రజలకు అందించాలని ఆదేశించారు. గ్రామ, పట్టణ స్థాయిలో రుణాలు, రికవరీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్య వేదికగా నిలిచిన స్త్రీనిధి సంస్థ కార్యకలాపాలపై పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణ సదుపాయాలు, వాటి పంపిణీ, తిరిగి చెల్లింపుల పరిస్థితి, సంస్థ పురోగతి తదితర అంశాలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు సమీక్షలో వివరించిన ప్రకారం, గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్త్రీనిధి ద్వారా రూ.1947 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటికే రూ.2064 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందజేశారు. తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ రుణ ప్రణాళికలో దాదాపు 90 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. గత సంవత్సరం 78 శాతం రికవరీ సాధించగా, ప్రస్తుత సంవత్సరం 72 శాతం రికవరీ నమోదైందని, సెర్ప్ మరియు మెప్మా సిబ్బంది సమన్వయంతో 85 శాతం రికవరీ లక్ష్యంతో క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. స్త్రీనిధి స్థాపన నుంచి ఇప్పటివరకు పారదర్శకంగా పనిచేస్తున్నందున అనేక బ్యాంకులు సంస్థకు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయని అధికారులు తెలిపారు. గతంలో అవకతవకలకు పాల్పడిన 16 మంది సిబ్బందిని తొలగించినట్లు వెల్లడించారు. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం 163 మంది సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కూడా వివరించారు. అలాగే సెర్ప్ మరియు మెప్మా సిబ్బందికి ప్రగతి ఆధారిత ప్రోత్సాహకాలు (పర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్) ఇవ్వాలని పాలకవర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఇటీవల కొన్ని పత్రికల్లో స్త్రీనిధి కార్యకలాపాలపై వచ్చిన కథనాలపై మంత్రి సీతక్క ప్రత్యేకంగా చర్చించి, వాటిలో ప్రస్తావించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. స్త్రీనిధి నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు ఎక్కడైనా నిర్ధారణ అయితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీమ్ ఇండియా ఆటగాడు తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. టీ20 ప్రపంచ కప్- గెలుచుకుని హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా సీఎంను తిలక్ వర్మ కలిశారు. ఈ సందర్భంగా తిలక్ వర్మను సీఎం రేవంత్‌రెడ్డి సత్కరించి, అభినందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎస్ఏటీజీ చైర్మన్ శివసేనారెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు. – ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్

టీపీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటు

- ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం కోసం
- 8 మందితో కూడిన కమిటీని ప్రకటించిన ఏఐసీసీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం కోసం 8 మందితో కూడిన సమన్వయ కమిటీని ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజా నర్సింహా, సీతక్క, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీ చంద్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయంతో పాటు సమర్థవంతమైన పనితీరు, సజావుగా పనులు జరిగేలా ఈ కమిటీ పని చేస్తుందని ఏఐసీసీ ప్రకటించింది.

ఢిల్లీలో ఎంపీల సమావేశం

ఢిల్లీ తెలంగాణ భవన్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపీలు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ఏంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, కడియం కావ్య, రామ సహాయం రఘురామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. లోక్ సభలో డిమాండ్ ఫర్ గ్రాంట్స్ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం తరపున ఏ అంశాలు లేవనెత్తాలి అనే దానిపై ఎంపీలు చర్చించారు. తెలంగాణలో పెండింగ్ సమస్యలపై కూడా ఎంపీలు చర్చించి, లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్, అద్వైత్ కుమార్ పాల్గొన్నారు.

– ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్

అన్నీ అవాస్తవాలు, గందరగోళ మాటలు

- గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16: తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని, ఎన్నేళ్లు అయినా వారికి బెనిఫిట్స్ అందడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచి పెట్టమని, తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో తెలంగాణ గేయం తర్వాత వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని అవమానించారని మండిపడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరు సిగ్గుచేటన్నారు. వందేమాతరం వినడానికి ఆసక్తి లేకనా? లేక దేశభక్తి లేకపోవడమా అని ప్రశ్నించారు. వందేమాతరం గేయాన్ని అవమానపరిచిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

సినీ నటి ప్రత్యూష మృతి కేసు..

నాంపల్లి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థ్ రెడ్డి



ప్రతిపక్షం బ్యూరో, హైదరాబాద్‌సిటీ, మార్చి 16: టాలీవుడ్ నటి ప్రత్యూష మృతి కేసులో ప్రధాన నిందితుడు సిద్ధార్థ్ రెడ్డి నాంపల్లి కోర్టులో సోమవారం లొంగిపోయాడు. ఫిబ్రవరి 17న సిద్ధార్థ్ అభ్యర్థనలను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు, అతడిని నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. 24 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న సిద్ధార్థ్ఎట్టకేలకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయాడు. సినీ నటి ప్రత్యూష ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. తమ ప్రేమను కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో ప్రియుడు సిద్ధార్థ్ రెడ్డి, ఆమె కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగారు. చికిత్స పొందుతూ ప్రత్యూష 2022 ఫిబ్రవరి 23న మరణించగా, సిద్ధార్థ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే.. తన కూతురు ప్రత్యూషది ఆత్మహత్య కాదు హత్య అని ఆమె తల్లి కేసు వేసింది. దాంతో, ట్రయల్ కోర్టులో సిద్ధార్థ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అయితే.. ఈ వ్యవధిని హైకోర్టు రెండేళ్లకు తగ్గించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థ్ సుప్రీం కోర్టుకు వెళ్లాడు. అత్యున్నత ధర్మాసనం సైతం హైకోర్టు తీర్పునే సమర్థించింది. నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు చివరి రోజున సిద్ధార్థ్ నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు.

యూఎస్, ఇజ్రాయెల్ దాడుల్లో వందలాది ఇరానియన్లు చనిపోయారు. ఇందులో 200 మందికి పైగా పిల్లలున్నారు. ఇరానియన్లను చంపడాన్ని పొరుగు దేశాలు ప్రోత్సహిస్తున్నాయి. మేం సీజ్‌ఫైర్ వద్దనేది యుద్ధం కోసం కాదు. శత్రువులు మాపై మరోసారి దాడులు చేయకుండా ఉండేలా ఈ యుద్ధాన్ని ముగించాలని అనుకుంటున్నాం. ఇప్పటికే వారికి గుణపాఠం చెప్పాం.

- ఇరాన్ ఫారిన్ మినిస్టర్ అరాఘ్చీ

ఓపెన్ వాయిస్

ఐదు రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది?

దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది.ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి.ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తల కిందులు చేసే అవకాశం ఉంది.దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది.తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి.తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి.ఈ ఇద్దరు దిగ్గజ నాయకులు తమ పట్టును నిలబెట్టుకుంటారా లేక ఓటమిని మూటగట్టుకుంటారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఓటర్ల నాడి వేరుగా ఉంటుంది. సంక్షేమ పథకాలపై నమ్మకమా? లేక పరిపాలనలో మార్పు కోరుకుంటున్నారా? అన్నది మే 4న వెల్లడి కానుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
17.03.2026

బాలికల భవిష్యత్తును నిర్మించే టీచర్లకు భద్రత ఎక్కడ?

ప్రభుత్వాలు ఒకవైపు 'మహిళా పక్షపాతి' అని చెప్పుకుంటూనే, మరోవైపు వేల సంఖ్యలో ఉన్న కెజీబీవీ మహిళా సిబ్బందిని విస్మరించడం విచారకరం. ఎన్నికల మేనిఫెస్టోలలో " కేజీబీవీ ఉపాధ్యాయులను పర్మినెంట్ చేస్తామని " హామీలు ఇస్తారు. అధికారంలోకి వచ్చాక "బడ్జెట్ లోటు" లేదా "సాంకేతిక కారణాలు" చూపిస్తూ ఫైళ్లను పక్కన పడేస్తారు. "సమాన పనికి సమాన వేతనం" ఉండాలని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. అయినా, ప్రభుత్వాలు కోర్టు తీర్పులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయి. మహిళా సాధికారత గురించి మాట్లాడే నాయకులు, ఈ పదివేల మంది మహిళా ఉపాధ్యాయుల కన్నీళ్లను ఎందుకు చూడలేకపోతున్నారు?

జుర్రు నారాయణ యాదవ్
9494019270

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః (ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అని మన పురాణాలు చెబుతాయి. ఆధునిక ప్రభుత్వాలు కూడా 'బేటీ బచావో బేటీ పఢావో' వంటి నినాదాలతో మహిళా సంక్షేమం తమ ప్రాధాన్యత అని చాటుకుంటాయి. కానీ, సమాజంలో అట్టడుగున ఉన్న బాలికలకు విద్యనందిస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయనీయుల జీవితాల్లో మాత్రం వెలుగులు నింపడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.20 ఏళ్లుగా కాంట్రాక్టు ముసుగులో వారిని తక్కువ జీతాలకే పని చేయించుకోవడం ప్రభుత్వాల ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

కేజీబీవీల ఆవిర్భావం - ఆశయాలు:
వెనుకబడిన ప్రాంతాల్లోని బాలికలు,డ్రాపౌట్లు,అనాథలు మరియు పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 2004లో కెజీబీవీలు ప్రారంభమయ్యాయి.ఇక్కడ విద్యాబోధన నుండి నిర్వహణ వరకు అంతా మహిళలే చూసుకుంటారు.ఒక రకంగా ఇది మహిళా శక్తికి ప్రతీకగా నిలుస్తున్న వ్యవస్థ.కానీ,ఆ వ్యవస్థను నడుపుతున్న మహిళల జీవితాలకు భద్రత కరువైంది.

తెలంగాణలో కేజీబీవీలు:
తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాల్లోని బాలికల విద్య కోసం ప్రభుత్వం భారీ సంఖ్యలో కేజీబీవీలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 475 కేజీబీవీలు పని చేస్తున్నాయి.వీటిలో 245 పాఠశాలలు 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయబడ్డాయి. సుమారు 1.24 లక్షల మంది బాలికలు ఈ విద్యాలయాల్లో ఆశ్రయం పొందుతూ చదువుకుంటున్నారు.దాదాపు 10,000 నుండి 12,000 మంది మహిళా ఉపాధ్యాయులు (స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సిఆర్టి లు, పీఈటీలు) మరియు బోధనేతర సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో విధులను నిర్వర్తిస్తున్నారు.

అర్హత ఉన్నా అభద్రతే ఎందుకు?:
ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు కేవలం 'తాత్కాలిక' వ్యక్తులు కాదు. వీరందరూ ప్రభుత్వం నిర్వహించే టెట్ (TET), ఇతర అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన వారే. కేజీబీవీలు రెసిడెన్షియల్ పాఠశాలలు కావడంతో, ఇక్కడి ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితం కాకుండా, 24 గంటలు వార్డెన్లుగా, విద్యార్థుల సంరక్షకులుగా బాధ్యతలు మోస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానమైన అర్హతలు, వారికంటే ఎక్కువ పని గంటలు ఉన్నా.. వీరికి ఇచ్చే వేతనం మాత్రం నామమాత్రమే. గత 20 ఏళ్లుగా ఇదే 'కాంట్రాక్టు' ముసుగులో తక్కువ జీతాలకే వెట్టిచాకిరి చేయించుకోవడం అన్యాయం కాదా?

రెండు దశాబ్దాల వెట్టి చాకిరి:
ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఉండాల్సిన అర్హతలన్నీ ఉండి,పారదర్శకమైన ఎంపిక ప్రక్రియ ద్వారా నియమితులైన ఈ ఉపాధ్యాయునీయులు గత 20 ఏళ్లుగా 'కాంట్రాక్టు' అనే తాత్కాలిక పద్ధతిలోనే పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా,ఇంకా చెప్పాలంటే వారికంటే ఎక్కువ సమయం (వసతి గృహ బాధ్యతలు కూడా) కేటాయిస్తున్నా,వీరికి ఇచ్చే వేతనం మాత్రం చాలా తక్కువ. దశాబ్దాల కాలంగా విద్యా వ్యవస్థకు సేవలందిస్తున్న వీరిని రెగ్యులర్ చేసే విషయంలో ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయి.ఇతర శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సందర్భాలు ఉన్నా,కేవలం మహిళా ఉపాధ్యాయులే ఉన్న ఈ విభాగంపై వివక్ష చూపుతున్నారు ఎందుకో?.

సామాజిక అభద్రత,ఆర్థిక ఇబ్బందులు- ఆందోళనలో కుటుంబాలు:
నేటి ధరల పెరుగుదల కాలంలో,స్వల్ప వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోవడం వీరికి పెను సవాలుగా మారింది. ఈ ఉపాధ్యాయుల్లో చాలామంది ఇప్పుడు 45 నుండి 55 ఏళ్ల వయసులో ఉన్నారు. రేపు పదవీ విరమణ చేస్తే వీరికి పెన్షన్ ఉండదు, గ్రాట్యుటీ ఉండదు, కనీసం చేతిలో చిల్లిగవ్వ ఉండదు. నిరంతరం పని ఒత్తిడిలో ఉంటూ అనారోగ్యానికి గురైతే, ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే హెల్త్ కార్డులు వీరికి వర్తించవు. కాంట్రాక్టు ఉద్యోగం కావడంతో బ్యాంకులు వీరికి గృహ రుణాలు లేదా వ్యక్తిగత రుణాలు ఇవ్వడానికి వెనుకాడతాయి.ప్రతి ఏటా కాంట్రాక్టు రిన్యువల్ అవుతుందో లేదో అన్న భయం వారిని మానసిక ఆందోళనకు గురిచేస్తోంది. మహిళా ఉపాధ్యాయులకు కనీస ప్రసూతి సెలవులు, అనారోగ్య సెలవులు పొందడం కూడా అగ్నిపరీక్షగా మారుతోంది.

డిమాండ్లు:

1. **కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత నియామకం చేయాలి.**
2. **రెగ్యులర్ ప్రభుత్వ టీచర్లతో సమానమైన లేదా సమీప వేతనం ఇవ్వాలి.**
3. **డీఏ, ఇంక్రిమెంట్లు అమలు వర్తింపజేయాలి.**
4. **పెన్షన్ / రిటైర్మెంట్ భద్రత కల్పించాలి.**
5. **ఆరోగ్య మరియు ప్రమాద బీమా కల్పించాలి.**
6. **సర్వీస్ రూల్స్ స్పష్టత, బదిలీలు, ప్రమోషన్లు, శిక్షా చర్యలకు స్పష్టమైన నియమాలు ఉండాలి.**
7. **24×7 రెసిడెన్షియల్ బాధ్యతలను తగ్గించేలా తగిన సిబ్బంది నియామకం చేయాలి.**
8. **రాత్రి విధులకు భద్రతా ఏర్పాట్లు, POSH కమిటీలు అమలు చేయాలి.**
9. **ప్రసూతి సెలవులు, మెడికల్ లీవ్, క్యాజువల్ లీవ్ వంటి హక్కులు కల్పించాలి.**
10. **అనుభవం ఆధారంగా ఉన్నత పదవులకు పదోన్నతులు ఇవ్వాలి.**

బాలికా విద్యను ప్రోత్సహించే కెజీబీవీలు సజావుగా సాగాలంటే,అక్కడ పనిచేసే ఉపాధ్యాయునుల మనసు ప్రశాంతంగా ఉండాలి. వారి ఆర్థిక భవిష్యత్తుపై భరోసా ఉన్నప్పుడే వారు మరింత ఉత్సాహంతో విద్యాబోధన చేయగలరు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ద్వంద్వ వైఖరిని వీడాలి. 20 ఏళ్లుగా వెలుగులు పంచుతున్న ఈ "అక్షర దీపాలను" కాంట్రాక్టు చీకట్ల నుండి విముక్తం చేసి, వారి సర్వీసును వెంటనే క్రమబద్ధీకరించాలి. అది మాత్రమే నిజమైన మహిళా సాధికారత అవుతుంది.

(వ్యాసకర్త తెలంగాణ టీచర్స్ యూనియన్ నాయకులు)

సామాజిక తెలంగాణ సాధనలో అన్నా చెల్లెలి పోరాటం

డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం
9618473996

సామాజిక తెలంగాణ నిర్మాణ ఉద్యమంలో ఓ కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఒకే లక్ష్యంతో భిన్న దారుల్లో సాగుతున్న ఉద్యమకారులు ఒక్కతాటిపైకి వచ్చారు. దారులు వేరైనా ఒక్కటైన గమ్యం తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ లను కలిపింది. వీరి ఉద్యమ బంధం అణగారిన పక్షాలకు అండగా నిలిచింది. పేదలకు న్యాయం చేయడమే అంతిమ లక్ష్యంగా సాగే స్వచ్ఛ ఉద్యమాలకు వీరిప్పుడు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రాజకీయ వ్యవస్థలో ఎలా ఉండాలో గుర్తుచేస్తున్నారు. తాము చేస్తున్న పోరాటం రాజకీయ వ్యవస్థలో కొత్త ఒరవడిని సృష్టించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తే పరిస్థితి ఏర్పడింది. ప్రజా పోరాటాలు చేస్తూ రాజకీయ వర్గాల్లో వీరు అనుసరిస్తున్న వ్యూహం అంతుచిక్కకుండా ఉంది. వెలుగుమట్ల గృహనిర్వాసితుల గోసకు హాపీ ఎండింగ్ ఇవ్వడానికి కవిత, విశారదన్ ఎంచుకున్న దారి ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. తెలంగాణ ఉద్యమానికి ప్రజలను కదిలించే బలమైన పునాది ఎక్కడైతే పడిందో అదే ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల సాక్షిగా ఈ కొత్త తరహా పోరాట పంథా పురుడు పోసుకోవడం విశేషం. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు దక్కాలనే దృఢ సంకల్పంతో ఆలోచిస్తున్న వీరి విధానం, వీళ్ళ పోరాటాలే వీళ్లను అన్నాచెల్లెలుగా దగ్గర చేసింది.

వెలుగుమట్ల సాక్షిగా...
ఈ భారతదేశ చరిత్ర, సంస్కృతి భూమితోనే ముడిపడి ఉంది. ఈ నేల పైన జరిగిన ఎన్నో యుద్ధాలు, ఉద్యమాలు భూమి కోసం జరిగినవే. తెలంగాణ ప్రాంతం భారతదేశ చరిత్రలో భూమిభుక్తివిముక్తి పోరాటాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. భూమి కోసం పోరాటం, భూదాన ఉద్యమం ఫలితంగా అక్కడక్కడ కొంత నిరుపేదలకు భూములు ఇచ్చారు. కానీ పేద ప్రజల కోసం ఇచ్చిన ఆ భూములు నేడు మళ్లీ ఆక్రమణకు గురి అవుతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో జరిగిన సంఘటనలు ఇందుకు నిదర్శనం. పేదలకు ఇచ్చిన భూదాన్ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడంతో ఒక్కసారిగా వాళ్లు నిరాశ్రయులుగా మారారు. గూడు చెదిరిపోయిన ప్రజల పక్షాన పోరాటం చేయల్సిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఫోటోలకు పోజులిచ్చి వెళ్లారు తప్ప ప్రభుత్వాన్ని నిలదీసింది లేదు. ఈ సందర్భంలోనే ప్రజా పోరాటాలు చేస్తున్న

తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజు ఇద్దరు కలిసి వెలుగుమట్ల బాధితుల కోసం ఉమ్మడి ఆందోళనకు శ్రీకారం చుట్టారు. అక్కడికక్కడే నిరవధిక నిరాహార దీక్ష చేపట్టి, బాధితుల ఇండ్లు కూల్చేసిన చోటనే ఇండ్ల పట్టాలు ఇప్పించారు.

లక్ష కిలోమీటర్ల పాదయాత్ర
కవిత, విశారదన్ మహారాజ్ కాంబినేషన్ ఇలానే ఉంటే రానున్న 2029 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజామోదం ఈ కూటమికే దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్న మాట విద్యావంతులు, మేధావులు, బుద్ధి జీవులు, రాజకీయవేత్తల్లో సర్కిల్లో చెక్కర్లు కొడుతున్నది. కవిత 20 సంవత్సరాలుగా రాజకీయ అనుభవంలో అనేక ఒడిదుడుకులు, అనేక కట్టుబాట్లు, ఒత్తిళ్లు అన్నింటిని ఎదుర్కుంటూ ప్రజల కోసం ప్రతిక్షణం తపిస్తున్నది. ఈ అన్నా చెల్లెలు కలిసి ఈ విధమైన పోరాటాలు చేస్తే ప్రజాసమస్యల పరిష్కారం సులభమవుతుందన్న నమ్మకం పేద, బడుగువర్గాల్లో వస్తున్నది. రెండు దశాబ్దాల పైన ప్రజల మధ్యన ఉన్న కవిత తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ప్రజల సంస్కృతిని, ఆత్మ గౌరవాన్ని కాపాడడానికి బతుకమ్మనెత్తుకొని ఊరూరా తిరిగి తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగోన్నారు. టీఆర్ఎస్ పార్టీలో పార్లమెంటు సభ్యురాలుగా, శాసనమండలి సభ్యురాలుగా ఉన్నప్పటికీ తన గళాన్ని నిత్యం ప్రజల పక్షాన వినిపిస్తూనే వచ్చింది. ఈ మధ్యకాలంలో బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ అయినప్పటి నుండి ఒక్కరోజు కూడా ఖాళీగా లేకుండా జాగృతి జనంబాట కార్యక్రమంతో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. యునైటెడ్ ఫులే ఫ్రంట్ ఏర్పాటు చేసి తెలంగాణలోని అన్ని బీసీ కులాల ప్రతినిధులతో కలిసి విద్య, ఉద్యోగ, రాజకీయాలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమించారు. రైల్ రోకో, నిరాహారదీక్ష సహా అనేక రకాల ప్రజా ఉద్యమాలు చేపట్టారు.

రాజకీయ పునరేకీకరణ
కవిత, విశారదన్ వీరిద్దరి ఆశయాలు ఒకే విధానంలో ఉండడం వల్ల తెలంగాణ ప్రాంతంలోని అట్టడుగు అణగారిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, యువతరంలో ఆశలు చిగురించాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనకబడ్డ వారికి ప్రాధాన్యత కల్పించాలని, కవిత ఉద్యమిస్తున్న విధానంతో పాటు, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్ తో కలిసి ఈ అన్నా చెల్లెలు పోరాటం రాజకీయ శక్తుల పునరేకీకరణ కోసం అడుగులు పడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ చాతుర్వర్ణ వ్యవస్థలో దళితులు ఎంతగా అణచివేయబడ్డారో ఈ పితృస్వామ్య దేశంలో మహిళలు అంతకంటే ఎక్కువగా అణిచివేయబడ్డారు. కల్వకుంట్ల కవితనే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. కవిత గనుక మగపుట్టుక పుట్టి ఉంటే టిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ అయ్యేవారా..? కవిత ఒక మహిళ కాబట్టి ఈ పురుష ఆధిపత్య ప్రపంచంలో కవిత సంపన్న కులానికి చెందిన మహిళ అయినప్పటికీ అణచివేయబడ్డ మహిళనే. కన్న తండ్రి కేసీఆర్, తోడబుట్టిన అన్న కేటీఆర్ సొంత చెల్లెను దూరం చేసుకుంటే ఈరోజు తెలంగాణ సమాజం కవితను సొంత ఆడబిడ్డగా అక్కున చేర్చుకున్నది. ఇదే పోరాట పటిమతో, ఇదే తరహా భావజాలంతో, ఆలోచనలతో విశారదన్ మహారాజ్ ,కవితల మధ్య ఏర్పడ్డ అన్నాచెల్లి బంధం కొనసాగితే సామాజిక తెలంగాణ సాధ్యమే.

(వ్యాసకర్త అధ్యాపకులు, కాకతీయ యూనివర్సిటీ)

పథకాలపై ఆధారపడుతూ స్వశక్తిని కోల్పోతున్న సమాజం

మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

ప్రస్తుతం ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను ప్రవేశ పెడుతున్నాయి. ముఖ్యంగా రైతులు,పేదలు,గిరిజనులు,ఆర్థికంగా వెనుకబడిన వర్గాల జీవన స్థితి మెరుగుపడాలని ఉద్దేశంతో ఈ పథకాలు అమలు చేస్తున్నాయి. నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేసే విధంగా పథకాలను రూపొందించడం ద్వారా ప్రభుత్వం వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించే ప్రయత్నం చేస్తోంది.వ్యవసాయం,విద్య,ఆరోగ్యం, జీవనోపాధి వంటి విభిన్న రంగాలలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రైతు భరోసా, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు ఎంతో మందికి ఉపశమనాన్ని అందించాయి. ఈ పథకాల వల్ల అనేక కుటుంబాలు తాత్కాలిక ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పథకాలపై ఆధారపడటం వలన జరిగే ప్రభావాలు
అయితే కాలక్రమేణా ఈ పథకాలు ప్రజల జీవితాల్లో ఒక అలవాటుగా మారిపోయాయి. ప్రతి ఏడాది లేదా ప్రతి విడతలో వచ్చే ఆర్థిక సహాయం కోసం అనేక మంది ఎదురు చూడటం మొదలైంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రైతులు ఈ డబ్బులపై ఎక్కువగా ఆధారపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దాదాపు ఎనిమిదేళ్లుగా ఈ పథకాల ద్వారా డబ్బులు అందుకుంటూ వచ్చిన ప్రజలు ఇప్పుడు ఏదైనా కారణంతో ఆ డబ్బులు ఆలస్యంగా వస్తే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యవసాయం చేయడం, కూలి పనులు చేయడం వంటి సంప్రదాయ మార్గాలపై దృష్టి తగ్గి, ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో పంట పెట్టుబడులు, కుటుంబ అవసరాలు వంటి విషయాల్లో కూడా ఈ పథకాల డబ్బులపైనే ఆధారపడే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పథకాల డబ్బులు సమయానికి రాకపోతే ప్రజల్లో ఆందోళన, అసంతృప్తి పెరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మెల్ల మెల్లగా తగ్గిపోతున్న స్వశక్తి
గతంలో రైతన్నలు తమ కష్టాన్ని నమ్ముకుని పరస్పర సహకారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. పొలం

దున్ని, చెమటోడ్చి సంపాదించిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవారు. స్వశక్తి మీద విశ్వాసం ఉండేది. కానీ ప్రస్తుతం కొంతమంది ప్రభుత్వ పథకాలపై అధికంగా ఆధారపడటం వల్ల పని మీద ఆసక్తి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా కష్టపడి సంపాదించే స్వభావం మెల్లగా తగ్గిపోతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రభుత్వ పథకాలు ప్రజలకు సహాయం చేయడానికే కానీ పూర్తిగా ఆధారపడేలా చేయడానికి కావు. అవి తాత్కాలిక భరోసా మాత్రమే. ప్రజలు కూడా వాటిని అలా చూసుకోవాలి. స్వశక్తి, కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉంటేనే జీవితంలో స్థిరత్వం వస్తుంది.అందుకే ప్రభుత్వం ఇచ్చే పథకాలను సహాయకంగా తీసుకుని, స్వంత కష్టంపై ఆధారపడి జీవనం సాగించడం అవసరం. పని మీద నమ్మకం, కష్టం మీద విశ్వాసం ఉంటేనే భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక కష్టాలను ధైర్యంగా ఎదుర్కోగలం.

(వ్యాసకర్త జర్నలిస్ట్ గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ఆస్తిపన్నుపై 90 శాతం రాయితీతో ఓటీఎస్ స్కీం

- క్యూర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, 16 మార్చి : ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీతో పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. మార్చి 31 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) స్కీమ్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యూర్ ఏరియాలో 28 లక్షల 8 వేల ఆస్తి పన్నుదారుల్లో 16 లక్షల 80 వేల మంది చెల్లించారని చెప్పారు. సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ప్రాపర్టీ టాక్స్ ఓ టి ఎస్ స్కీం వివరాలు వెల్లడించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, రెవెన్యూ అదనపు కమిషనర్ ప్రియాంక అల, సానిటేషన్ అదనపు కమిషనర్ రవి కిరణ్, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్యూర్ ఏరియా పరిధి జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ లో గత ఆర్థిక సంవత్సరం ఇదే రోజు నాటికి ఆస్తి పన్ను వసూళ్లు 1984 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నేటి వరకూ రూ.2,186 కోట్ల పన్ను వసూలైందన్నారు. పన్ను చెల్లింపుల్లో పారదర్శకత, జవాబుదారితనాన్ని పెంపొందించేందుకు ఆన్లైన్ విధానంలో ప్రాపర్టీ టాక్స్ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మీ సేవ, www ghmc. gov.in పోర్టల్, సిటిజన్ సర్వీస్ సెంటర్, మై క్యూర్ లలో ఆస్తి పన్ను దీర్ఘకాలికంగా చెల్లించని వారి పై జిహెచ్ఎంసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుతో పాటు అసెస్మెంట్ , కరెక్షన్ సహా అనేక సేవలు మై క్యూర్ అప్లికేషన్ లో అందుబాటులో ఉంటాయన్నారు. సాంకేతికత దన్నుగా జిహెచ్ఎంసి పరిధిలో సుపరిపాలన అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కర్ణన్ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం లో భాగంగా కార్యక్రమం ప్రారంభమైన ఈ నెల 6 నుంచి 16 వ తేదీ వరకూ జీహెచ్ఎంసీ పరిధిలోని 6 జోన్లు, 30 సర్కిల్ కార్యాలయాలు, 150 వార్డుల పరిధి లోని జీహెచ్ఎంసీ కార్యాలయాల క్లీనింగ్, ఫైల్స్ క్లియరెన్స్, GVP ల మ్యాపింగ్ , ఎలిమినేషన్ చర్యలు, సి అండ్ డి వేస్ట్ తొలగింపు, FOBs, RUBs, అండర్ పాస్ లు, ఫ్లై ఓవర్ లు, ఫైర్ సేఫ్టీ, ఈ వేస్ట్ మెగా డ్రైవ్, ప్రజా మరుగుదొడ్ల క్లీనింగ్, నిర్వహణ పై ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టామని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో పారిశుద్ధ్యంపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లు ఉండొద్దన్న లక్ష్యంతో పని చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అలాగే మెగా ఈవేస్ట్ డ్రైవ్ ను సక్సెస్ ఫుల్ గా చేపట్టామని కమిషనర్ కర్ణన్ తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక అమలు కాలంలో పారిశుధ్యం పై మరింత ఫోకస్ పెట్టి గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చి దిద్దుతామని కమిషనర్ తెలిపారు.

ముమ్మరంగా ప్రాపర్టీ టాక్స్ ఓటీఎస్ ప్రచారం

ప్రాపర్టీ టాక్స్ ఓటీఎస్ గడువుకు ఇంకా 15 రోజులే ఉన్నందున ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ ఓ టి ఎస్ స్కీమును క్యూర్ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకూ 100 బస్ షెల్టర్ ల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఓటీఎస్ పై ప్రత్యేక ప్రచార వీడియోలు, ఆడియో లు సిద్ధం చేసి కేబుల్ న్యూస్ ఛానల్ , FM రేడియో లు, సోషల్ మీడియా ద్వారా CURE వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. CURE వ్యాప్తంగా ఉన్న థియేటర్ లలో ప్రచారం కోసం రెండు ప్రత్యేక వీడియోలు రూపొందించాం. వీడియో ల కోసం సీబీఎఫ్సీ నుంచి అనుమతులు కూడా తీసుకున్నాం. రేపటి నుంచి థియేటర్ లలో కూడా ప్రచార వీడియోలు ప్రదర్శిస్తాం. అలాగే ప్రింట్ , ఎలెక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో రానున్న రోజుల్లో మరింత విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

సమర్థవంతమైన పన్ను విధానాలతో అభివృద్ధి

- సీఎం రేవంత్ తో ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ భేటీ
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై చర్చ
- విద్యుత్, స్టాంప్స్–రిజిస్ట్రేషన్, జీఎస్టీ అంశాలపై సమీక్ష
- పలు కీలక సూచనలు చేసిన సుబ్రమణియన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16 : ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, సమర్థవంతమైన పన్ను విధానాలు అమలు చేస్తే అభివృద్ధి వేగవంతమవుతుందని ప్రముఖ ఆర్థికవేత్త అర్విందసుబ్రమణియన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రముఖ ఆర్థికవేత్త అర్వింద్‌సుబ్రమణియన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలోరాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత బలంగా తీర్చిదిద్దేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని సుబ్రమణియన్ సూచించారు. ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, సమర్థవంతమైన పన్ను విధానాలు అమలు చేస్తే అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా విద్యుత్ రంగం ఖర్చుల నమూనా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో మూల్యాంకన విధానం, జీఎస్టీ పన్నుల అంచనా విధానం వంటి అంశాలపై చర్చ జరిగింది. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచడం, వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థికవేత్త సుబ్రమణియన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఆదాయ వనరులను విస్తరించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా ఖర్చులను నిర్వహిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

అసెంబ్లీకి సభ్యులు కచ్చితంగా రావాలి

- రాష్ట్ర స్థాయి విషయాలు మాట్లాడొద్దు
- అనవసరపు కాంట్రవర్సీలు వద్దు
- మూడు సార్లు అటెండెన్స్ తీసుకుంటాం
- బీఆర్ఎస్ నేతల నెగిటివ్ మాత్రమే కాదు
- మనం చేస్తున్న పాజిటివ్ ను కూడా చెప్పాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16 : సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీకి సభ్యులు అందరూ కచ్చితంగా అటెండ్ కావాల్సిందేనని తేల్చి చెప్పారు. సభకు వచ్చి అటెండెన్స్ వేసుకొని వెళ్తామంటే కుదరదని స్పష్టం చేశారు. అటెండెన్స్ కచ్చితంగా మూడుసార్లు తీసుకుంటామన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అటెండెన్స్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు సబ్జెక్ట్ మీద కూడా ప్రిపేర్ కావాలని సీఎం రేవంత్ సూచించారు. బీఆర్ఎస్ నేతల నెగిటివ్ మాత్రమే కాదు.. మనం చేస్తున్న పాజిటివ్ ను కూడా చెప్పాలని వారికి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ చేయలేదు కాబట్టే.. మనకు అధికారం ఇచ్చారని.. ఎంతసేపు వాళ్ళ నెగిటివ్ చెప్పడం కాదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. మున్సిపల్, లోకల్ బాడీ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఓడిపోయారు కాబట్టి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు కసి మీద ఉన్నారని, మనం సీరియస్ గా ఉండాలని రేవంత్ అన్నారు. అసెంబ్లీ కమిటీలను ఫుల్ ఫిల్ చేయాలన్నారు. ఎమ్మెల్యేలు స్టడీ టూర్ వెళ్లాలన్నారు. ఇక మీడియా ముందు మాట్లాడేటప్పుడు, చిట్ చాట్ చేసేటప్పుడు ఎమ్మెల్యేలు మరింత జాగ్రత్తగా ఉండాలని సీఎం రేవంత్ నొక్కి మరీ చెప్పారు. మీ నియోజకవర్గం వరకు మాట్లాడితే బాగుంటుందన్నారు. రాష్ట్ర స్థాయి విషయాలు మాట్లాడొద్దని వారికి సూచించారు. అనవసరపు కాంట్రవర్సీలు జోలికి వెళ్లొద్దన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలతో మీరే ప్రతిపక్షం లాగా ఇరుక్కోకండి అని జాగ్రత్తలు చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే మందుల సామెల్ కామెంట్స్ వివాదంగా మారడంతో సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

25 నుంచి ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ టోర్నీ

ప్రతిపక్షం, సిటీబ్యూరో, మార్చి 16 : హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకమైన 74వ బీఎన్ మల్లిక్ స్మారక ఆలిండియా పోలీస్ ఫుట్ బాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం పలువురు ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 'దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల, కేంద్ర సాయుధ బలగాల నుంచి ప్లేయర్లు హైదరాబాద్‌కు వస్తున్నారు. ఇందుకోసం నగరంలోని ఆరు ప్రధాన మైదానాలు గచ్చిబౌలి స్టేడియం, హెచ్ఎఫ్‌సీ స్పోర్ట్స్ ఎరీనా, శ్రీనిధి ఫుట్ బాల్ క్లబ్ గ్రౌండ్, జాతీయ పోలీస్ అకాడమీ మైదానం, ఆర్టిలరీ సెంటర్ గ్రౌండ్, పోలీస్ అకాడమీ మైదానాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. ఈనెల 25న గచ్చిబౌలిలో తెలంగాణ టీమ్ తలపడుతుంది' అని అన్నారు. టోర్నీలో మొత్తం 37పురుష, 9 మహిళల జట్లు బరిలో ఉన్నాయని వివరించారు.

ప్రజావాణి ఆర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, మార్చి 16: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ , అదనపు కమిషనర్ లు , విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. హెడ్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కి 46, ఆరు జోన్ల కు సంబంధించి 24 మొత్తం 70 ఫిర్యాదులు,వినతులు పౌరుల నుంచి అందాయి. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విభాగాల వారీగా వచ్చిన ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ లు రవి కిరణ్, సత్యనారాయణ, విజిలెన్స్ ఏఎస్పీ నరసింహ రెడ్డి, సీసీపీ శ్రీనివాస్ , CE సహదేవ్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నిక రద్దు

- హైకోర్టు స్టేతో రద్దు చేసిన ఎన్నికల కమిషన్



ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, మార్చి 16: రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియ దాదాపు పూర్తయిన తరుణంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులతో ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అదృశ్యం కావడమే ఈ ఎన్నిక వాయిదాకు కారణంగా తెలుస్తోంది. తన తండ్రిని ఎవరో కిడ్నాప్ చేశారని యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని ఎల్లుండి తమ ముందు హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు చైర్మన్ ఎన్నికపై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే, ఇబ్రహీంపట్నం కౌన్సిల్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్‌కి చెందిన టేకుల సుదర్శన్ రెడ్డిని 15 మంది కౌన్సిలర్లు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. ఈ క్రమంలో కిడ్నాప్ అయ్యారని భావించిన కౌన్సిలర్ యాదగిరి.. ఎన్నిక ప్రక్రియ ముగిసిన వెంటనే అనూహ్యంగా కౌన్సిల్ హాల్లో ప్రత్యక్షమయ్యారు. సరిగ్గా చైర్మన్ పేరును అధికారికంగా ప్రకటించాల్సిన సమయంలో హైకోర్టు స్టే ఉత్తర్వులు అందడంతో అధికారులు ఇబ్రహీంపట్నం ఎన్నికను నిలిపివేశారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీ రాములు జయంతి వేడుకలు వాసవి క్లబ్ హుస్నాబాద్ గ్రేటర్, వనిత క్లబ్ హుస్నాబాద్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్ పర్సన్ నూక సంపత్ కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు వనపర్తి వంశీ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సందీప్, కోశాధికారి గౌరిశెట్టి రవితేజ, వనిత క్లబ్ అధ్యక్షురాలు చొల్లేటి లత, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి మమత, కోశాధికారి మల్యాల రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఫలక్ నుమాలో అగ్నిప్రమాదం

ప్రతిపక్షం, సిటీబ్యూరో, మార్చి 16: హైదరాబాద్ ఫలక్‌నుమా పరిధి ఫరూక్‌నగర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఫరూక్‌నగర్ బస్‌డిపో పక్కన దుకాణాల్లో మంటలు ఎగిసిపడ్డాయి. రోడ్డుపక్కన ఉన్న సోఫాల తయారీ దుకాణంలో ఈ మంటలు చెలరేగాయి. దీనికి ఆనుకుని ఉన్న ఫర్నీచర్ షాపు, ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించాయి. ఫర్నీచర్ దుకాణానికి మంటలు వ్యాపించడంతో మంటల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పుతున్నారు. పక్కనే ఇండేన్ గ్యాస్ గోదాం, పెట్రోల్ బంక్ ఉండడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న దుకాణాల్లో ఉన్న వారిని తరలించారు. మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. చివరికి మంటలను అదుపు చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 16 : శాసనసభ ప్రాంగణంలో "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ గారితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి తో కలిసి గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి వారు అందించిన గొప్ప సేవలను స్మరించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ తెలంగాణ తల్లి విగ్రహం కేవలం ఒక రూపం మాత్రమే కాదని, ఇది కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, మార్చి 16 : హైదరాబాద్‌లోని గండిపేటలో విషాదం నెలకొంది. మూసీ నదిలో చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకులు మృతిచెందారు. ఆదివారం సాయంత్రం ముగ్గురు యువకులు చేపల వేటకు వచ్చిన ముగ్గురు యువకులు మూసీ నదిలో గల్లంతయ్యారు. సోమవారం ఉదయం ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు, రెస్క్యూటీమ్ చేపట్టిన గాలింపు చర్యల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ వారు నీటిలో మునిగి గల్లంతైనట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను ఇబ్రహీంబాగ్ ప్రాంతానికి చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేశ్ (25)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన వారిగా నిర్ధారించారు. సోమవారం ఉదయం మృతదేహాలను బయటకు తీసిన అనంతరం.. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు పోకుండా చూడాలి. స్కూళ్లు, ఆస్పత్రులు, గుడులకు గ్యాస్ సరఫరా ఆగకూడదు. ప్రజల్లో ఆందోళన లేకుండా చర్యలు తీసుకోవాలి. ఎల్పీజీ బదులు పైప్డ్ గ్యాస్, ఇండక్షన్ స్టవ్స్ వినియోగించేలా చేయాలి. ఎల్పీజీ వాడకం తగ్గించేలా హోటళ్ల యజమానులతో చర్చించాలి.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా
ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణస్వీకారం

- పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సమతా ప్రకాష్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి16: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు సమత ప్రకాష్ మాట్లాడుతూ... నూతనంగా తెలంగాణ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలుగా నియమితులైన ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణస్వీకారం మహోత్సవ వేడుకలో పాల్గొన్నట్టుగా తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భారత్, రాజేంద్రనగర్ అధ్యక్షురాలు రామారెడ్డి అమృత నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టుగా తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

- సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 16: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గము మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మ గూడా గ్రామంలో... పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో.. పారిశుద్ధ కార్మికులకు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలాగే కరోబార్ కి గ్రామపంచాయతీ తరఫున సన్మానించడం జరిగిందని గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో... డిప్యూటీ సర్పంచ్ డి దయాకర్ రెడ్డి. గ్రామ వార్డు సభ్యులు పారిశుద్ధ కార్మికులను. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి ని. కారోబార్ ని అంగన్వాడీ టీచర్ని. ఆశ వర్కర్ ని సన్మానించారు.

మహేశ్వరం నూతన ఇన్ స్పెక్టర్ కు ఘన సన్మానం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 16: మహేశ్వరం పోలీస్ స్టేషన్ కు నూతనంగా ఇన్స్పెక్టర్ గా విధుల్లో చేరిన రాఘవేందర్ రెడ్డిని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, కాంటెస్ట్ సర్పంచ్ వర్కల యాదగిరి గౌడ్, మన్సాన్‌పల్లి రాజు గౌడ్, తదితరులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నేరాలను నిరోధించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం, పౌరుల భద్రతకు భరోసా కల్పించడం శాంతి భద్రతలకు కృషి చేయాలని కోరారు. సీఐ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా నేరుగా పోలీసు స్టేషన్ లో సంప్రదించాలన్నారు. శాంతి భద్రతలను కాపాడటమే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేస్తామని ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, టెక్నాలజీని ఉపయోగించి పటిష్టమైన నిఘా పెడతామని వారు స్పష్టం చేశారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం, కిట్ల పంపిణీ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి16: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామంలో పారిశుద్ధ కార్మికుల సన్మాన కార్యక్రమం కిట్ల పంపిణీ గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించేందుకు గ్రామ సర్పంచి బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం మరియు కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది సబ్బుల్లో షాంపూలు శాలువ కప్పి పూలమాలతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు సెక్రటరీ శ్రీనివాస్ ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ వాడు మెంబర్స్ బొజ్జం మల్లేష్ మంగ శ్రీనివాస్ రాధా కుమార్ శిరీష మహేందర్ ఆశ వర్కర్ మమత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- హాజరైన సిహెచ్ యాదయ్య

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 16: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అమీర్‌పేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంద్రమ్మ ఇండ్లు పెండ్యాల శంకరాచారి & స్వర్ణలత మరియు పొంగువల అరుణ &లెట్ యాదగిరి గ్రామ శాఖ అధ్యక్షులు మన్సాన్‌పల్లి వెంకటేష్ గౌడ్ గ్రామ ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షులు ఆవుల రఘుపతి ఆధ్వర్యంలో ఇంద్రమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య కాంటెస్ట్ సర్పంచ్ వర్కల యాదగిరి గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు, ఆవుల యాదయ్య సీనియర్ నాయకులు గల్లా యాదయ్య కేజే ప్రసాద్ హైతాబాద్ రాజేందర్ మన్సాన్‌పల్లి రాజు గౌడ్ మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు *ఎర్ర చంద్రమోహన్ గ్రామ వార్డు సభ్యులు డప్పు జనార్ధన్, ఎండి షఫీ, మంచినీళ్ళ శ్రీనివాస్,మాజీ వార్డు సభ్యులు బస్వా యాదయ్య, తొంట ఈశ్వరయ్య, వర్కల ఈశ్వరయ్య, కమ్మరి యాదయ్య, తాళ్ల అంజయ్య, కంది సిద్ధులు,తొంట లక్ష్మిప్రసాద్, మద్దూరి శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, పిన్న మౌని రాఘవేందర్ ముదిరాజ్, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు నీగోళ్ళ బాలరాజ్, నీరటి మల్లేష్, గల్ల శ్రీకాంత్, ఎలుగని వంశి గౌడ్, గల్లా అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డప్పు ప్రేమ్ రాజ్, కురువ శివా, ఎర్ర తొంట సంతోష్, కంది వినయ్, సిహెచ్ బాలు, తొంట అఖిలేష్, మహేశ్వరం మండల్ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుటుంబంపై తప్పుడు ప్రచారం

- నా స్వంత భూమిని అమ్మితే
- దళితుల భూమి అంటూ ఆరోపణలా?
- బార్ అసోసియేషన్, పోలీసులకు ఫిర్యాదు చేస్తా
- భూ విక్రయదారు గొల్లగూడెం శివకళ

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 16 : గుర్రంపల్లి గ్రామంలో దళిత భూముల వివాదం కొత్త మలుపు తీసుకుంది. దళితుల భూమిని ఎమ్మెల్యే కుటుంబం అక్రమంగా కాజేసిందంటూ ఆరోపణలు చేస్తున్న దానక్క సంగమేశ్వర్‌పై భూ విక్రయదారు గొల్లగూడెం శివకళ ఘాటైన ఆరోపణలు చేశారు. భూమి విక్రయంలో తనకు కావాల్సిన భారీ కమిషన్ రాకపోవడంతోనే ఎమ్మెల్యే కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. చౌదరిగూడెం మండలం గుర్రంపల్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన శివకళ, "దళితుల భూమి పేరిట బ్లాక్ మెయిలింగ్‌లు మానుకో సంగమేశ్వర్" అంటూ తీవ్రంగా స్పందించారు. తాను చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమిని నిబంధనల ప్రకారం అమ్ముకున్నానని, దాన్ని రాజకీయంగా మలిచి ఎమ్మెల్యే కుటుంబాన్ని అపకీర్తి పాలుచేయడం సరికాదని అన్నారు.

పట్టా భూమి.. చట్టబద్ధ విక్రయం

గుర్రంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 10లో తనకు 7 ఎకరాలు 24 గుంటల పట్టా భూమి ఉందని శివకళ తెలిపారు. 2021లో షఫీ ఉల్ రబ్, యూనిస్ వద్ద నుంచి ఈ భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని చెప్పారు. అనంతరం వ్యక్తిగత అవసరాల కోసం ఎమ్మెల్యే సతీమణి అనురాధకు 2 ఎకరాలు 22 గుంటలు నిబంధనల ప్రకారం విక్రయించానని వెల్లడించారు."నా సొంత భూమిని నేను చట్టబద్ధంగా అమ్మితే దాన్ని దళిత భూమిగా చూపిస్తూ ఎమ్మెల్యే కుటుంబాన్ని అపవాదుకు గురిచేయడం వెనుక రాజకీయ కుట్ర ఉంది" అని ఆమె ఆరోపించారు.

కమిషన్ కోసం భూ వివాదంలో ప్రవేశం?

గుర్రంపల్లి గ్రామంలో దళిత రైతుల భూమి వివాదంలో సంగమేశ్వర్ జోక్యం చేసుకుని కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారని శివకళ పేర్కొన్నారు. ఆ తర్వాత భూమిపై ఏళ్లుగా కాస్తు చేస్తున్న రైతులను బెదిరించి రాజీ చేయించి, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి భూమి విక్రయం జరగేలా చేశారని ఆరోపించారు. ఆ లావాదేవీల్లో సంగమేశ్వర్ కమిషన్ తీసుకున్నారని, తర్వాత తన భూమి విక్రయానికి కూడా సహకరిస్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా కొంత డబ్బు తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను మీడియాకు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సతీమణి తన వద్ద నుంచి భూమి కొనుగోలు చేసినప్పుడు సంగమేశ్వర్ ఆశించిన పెద్ద మొత్తంలో కమిషన్ ఇవ్వలేదని, అదే కారణంగా ఇప్పుడు కొత్త వివాదానికి తెరలేపుతున్నారని శివకళ ఆరోపించారు. ఎమ్మెల్యే కుటుంబానికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసి మానసికంగా వేధించడమే కాకుండా ఎమ్మెల్యే కుటుంబ పరువును దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్న సంగమేశ్వర్‌పై పోలీసు స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేస్తానని శివకళ స్పష్టం చేశారు. అవసరమైతే బార్ అసోసియేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

వారంలోపు భూమి తిరిగి ఇవ్వాలి: న్యాయవాది సంగమేశ్వర్

గ్రామానికి చెందిన దళిత రైతులు దాదాపు వందేళ్లుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న సర్వే నంబర్ 10లోని భూమిపై అక్రమ మార్పులు జరిగాయని, ఈ భూమిని ఎమ్మెల్యే అనుచరుల ద్వారా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారని న్యాయవాది దానక్క సంగమేశ్వర్ ఆరోపించారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అధికారుల సహకారంతో ఎమ్మెల్యే భార్య అనురాధ కాసలాబాద్ పేరుమీద సుమారు 2 ఎకరాలు 22 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా మిగిలిన భూమిని కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితుల భూమిని అక్రమ పద్ధతుల్లో స్వాధీనం చేసుకున్న ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పి వారంలోపు ఆ భూమిని తిరిగి దళిత రైతుల పేరుమీద నమోదు చేయించాలని సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేద దళిత రైతుల హక్కుల కోసం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వెంకటాపూర్ పాఠశాలలో సీపీఆర్ అవగాహన

- ఏటీజీ హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- గుండెపోటు సమయంలో ప్రాణాలను కాపాడే సీపీఆర్ పై అవగాహన

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 16 : వెంకటాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఏటీజీ హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని ఈ సందర్భంగా వివరించారు. ప్రజలు ఇలాంటి ప్రాథమిక వైద్య పరిజ్ఞానం నేర్చుకోవడం చాలా అవసరమని, అత్యవసర పరిస్థితుల్లో ఇది ప్రాణాలను కాపాడటంలో ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దవీటి అర్చన అజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దవీటి విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్, గ్యాస్ ధరలను నియంత్రించాలి

- చేవెళ్లలో సీపీఐ నాయకులు, మహిళల ధర్నా

ప్రతిపక్షం, చేవెళ్ల. మార్చి 16 : యుద్ధోన్మాదం నశించాలి, పెట్రోల్ ధరలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ కె రామస్వామి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం ప్రభు లింగం అన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచాలన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు నియంత్రిస్తూ, గ్యాస్ కొరతను నివారించాలని, ప్రపంచ శాంతి కాపాడాలని, యుద్ధం నశించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండి మాక్బుల్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, సిపిఐ నాయకులు పెంటయ్య , మహిళా సంఘం నాయకురాలు జయమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ నిరసన

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 16 : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం అసెంబ్లీ నుంచి వాక్అవుట్ చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్పగా ప్రచారం చేసిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో నిరాశ నెలకొందని అన్నారు. ప్రజలకు స్పష్టమైన భరోసా కల్పించాలంటే వెంటనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలోమేడలే'

- బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం!
- ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకే రేవంత్ సర్కార్ కుట్ర
- కప్పాటి పాండురంగారెడ్డి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 16: తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం ఎంత మాత్రమూ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదని, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపనట్టుగా బతుకమ్మ సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలని చూడడం. కుదరకపోతే వక్రీకరించాలని చూడడం. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులు ఇవే. నేడు తెలంగాణలో నూటికి 90 మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్నది. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపాలి అనే అల్పసంతోషం తప్ప ఇది మరొకటి కాదని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం పట్ల కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు.

ప్రసంగంలోని డొల్లతనం - పచ్చి నిజాలు

2047 లక్ష్యం.. నేటి సంక్షోభం ఎవరికి కావాలి?: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదు. భవిష్యత్తు గురించి ఊహాచిత్రాలు గీస్తూ, నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారు. జీహెచ్ఎంసీ విభజన పరిపాలనా సౌలభ్యమా? రాజకీయ స్వార్థమా?: హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తూ జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం వెనుక గల అసలు ఉద్దేశం రాజకీయ ఆధిపత్యమే తప్ప ప్రజల సౌకర్యం కాదు. దీనివల్ల సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు, కేవలం అధికారుల సంఖ్య, ఖర్చు పెరుగుతుంది.

మూసీ ప్రక్షాళన - పేదల వెలివేత: మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు కానీ, దాని వల్ల నిరాశ్రయులవుతున్న వేలాది పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి అంటే.. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమా?

ఇక రైతు భరోసా - క్షేత్రస్థాయిలో అన్యాయం: 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇంకా ఎంతమంది కౌలు రైతులు, సామాన్య రైతులు సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారో పట్టించుకోవడం లేదు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది.

ఇందిరమ్మ ఇళ్లు - ఆచరణ సాధ్యమేనా?: 4 లక్షల ఇళ్ల నిర్మాణం అని చెబుతున్న ప్రభుత్వం, గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు? కొత్త ఇళ్ల మంజూరు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు.

బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు - సామాన్యుడికి దూరం: వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల ముచ్చట దశాబ్దాలుగా వింటున్నదే. ఇవన్నీ ఎన్నికల తాయిలాలుగానే కనిపిస్తున్నాయి తప్ప, సామాన్యుడి రవాణా కష్టాలను తీర్చేవి కావు. "ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది. పరిష్కారం చూపని 47 వేల పిటిషన్ల గణాంకాలు దేనికి సంకేతం? ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఈ ప్రసంగం ఉంది. 'జాగృతి' తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుంది. అని పాండురంగారెడ్డి అన్నారు.

“

అమరావతిలో అన్ని ఆఫీసులు ఒకేచోట ఉండేలా భవనాలు నిర్మిస్తున్నాం. 'జీఏడీ, హెఓడీలకు డయాగ్రిడ్ టెక్నాలజీతో 5 టవర్లు నిర్మిస్తున్నాం. జీఏడీ టవర్‌లో మొత్తం 47 అంతస్తులు, మిగిలిన టవర్లలో 40 అంతస్తులు ఉంటాయి. మొత్తం 53 లక్షల చదరపు అడుగుల ఏరియాతో ఈ టవర్ల నిర్మాణం చేస్తున్నాం.

- ఏపీ మంత్రి నారాయణ

ప్రాంతీయం

కొమురవెల్లిలో ఘనంగా అగ్నిగుండాలు

- అగ్నిగుండాలతో ముగిసిన 2025-26 జాతర బ్రహ్మోత్సవాలు
- అగ్నిగుండాలు పర్యవేక్షించిన కర్ణాటకకు చెందిన శ్రీ శివశంకర శివాచార్య మహాస్వామి

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో వీరశైవ ఆగమ శాస్త్ర సాంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు అగ్నిగుండాలు ఘనంగా నిర్వహించారు. వీరశైవ ఆగమ సాంప్రదాయం ప్రకారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం అర్ధరాత్రి 11.35 ని.లకు జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభించి సోమవారం తెల్లవారుజామున ఉదయం 4.45 గం.లకు అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కొమురవెల్లిలో అగ్నిగుండాలు ముగియడంతో 20252026 జాతర బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కొమురవెల్లిలో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణంతో జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమై అగ్నిగుండాలతో (మార్గశిల మాసం చివరి ఆదివారంతో ప్రారంభమై పాల్గుణమాసం చివరి సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిగుండాలతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

వీరశైవ ఆగమ శాస్త్ర సాంప్రదాయం ప్రకారం అగ్నిగుండాల నిర్వహణ

కొమురవెల్లిలోని అగ్నిగుండాలు వీరశైవ ఆగమ శాస్త్ర సాంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు ఘనంగా నిర్వహించారు. తోటబావి వద్ద అగ్నిగుండాల కోసం ఆలయ అర్చకులు మొదట గణపతిపూజ, వీరభద్రపళ్ళెరం, వీరభద్రఖడ్గంకు, దుర్గామాత (భద్రకాళీ) పూజలు, అగ్నిగుండాల స్థల ప్రాంగణంలో అర్చకులు వీరశైవ ఆగమ పండితులు భూమి పూజ, కలుషపూజలు చేసి అగ్నిగుండాలను అర్ధరాత్రి 11.45 నిమిషాలకు ప్రారంభించి జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం 50నుంచి 100క్వింటాళ్ళ సమిదలను కాల్చి సోమవారం తెల్లవారుజామున ఉ.4 గం.లకు వరకు బగబగ మండే నిప్పురవ్వలుగా చేసి 5.10 నిమిషాలకు అగ్నిగుండాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దండకాలు వేస్తూ అగ్నిగుండాల చుట్టు నాలుగు వైపుల అష్టదిక్బంధనం చేశారు. అగ్నిగుండాల చుట్టు నాలుగు వైపుల గుమ్మడి కాయలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ మండపం వద్ద అగ్నిగుండాల సమీపంలో వీరశైవ ఆగమ అర్చకులు శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగే అగ్నిగుండాలకు వేద పర్యవేక్షణ నిమిత్తం వచ్చిన కర్ణాటకకు చెందిన ష. బ్ర.108 గురువు శ్రీ శివశంకర శివాచార్య మహాస్వామి కర్ణాటక వారి ఆధ్వర్యంలో వీరశైవ అగమశాస్త్రం ప్రకారం అగ్నిగుండాలను నిర్వహించారు. అగ్నిగుండాలు నిర్వహణకు ముందు అర్చకుల గురువు శ్రీ శివశంకర శివాచార్య మహాస్వామి కాళ్ళు కడిగారు. అనంతరం వీరభద్రుడి పళ్ళెరం, వీరభద్రుడి ఖడ్గం అందజేసి అగ్నిగుండాలను మొదట అర్చకులు ఉ. 535 నిముషాలకు వీరభద్రుడి ఖడ్గం, వీరభద్రుడి పళ్ళెరంను పట్టుకొని అగ్నిగుండాలను దాటుతూ వెళ్ళి ఆలయ గర్భగుడి లోని మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు, శివసత్తులు ఒక్కొక్కరిగా అగ్నిగుండాలు దాటుతూ భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.

మల్లన్న ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం పూజలు

శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో అగ్నిగుండాలు నిర్వహించిన అనంతరం సోమవారం ఉ.11 గంటలకు ఆలయ గర్భగుడిలో శ్రీ మల్లికార్జునస్వామి కి ఏకాదశ రుద్రాభిషేకం, జంగమార్చన, మహాదా శీర్వదం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణతో పాటు స్వామికి పాలాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ఏఈఓలు బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాఫ్ రెడ్డి, టెంపుల్ చైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ధర్మకర్తలు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, చిగురు కొమురయ్య, బోరిగే రవి, వెలుగల మల్లేశం పాల్గొని పర్యవేంక్షిచారు.

సిధారెడ్డికి అవార్డు పట్ల పలువురి హర్షం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 16: ప్రముఖ తెలుగు సాహితీ వేత్త, కవి నందిని సిధారెడ్డికి ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కై ఎంపిక పట్ల గజ్వేల్ జర్నలిస్టుల సంఘం, మంజీరా రచయితల సంఘం, ఉద్యోగ మేధావి వర్గం వ్యక్తం చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ, ప్రజా కవి, రచయిత నందిని సిధారెడ్డి రచనతో 2025 సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికయ్యారు. కరోనా కాలం నాటి పరిస్థితులను, మానవ సంబంధాలను, ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోకుంటే జరిగే అనర్థాలను ప్రతిబింబిస్తూ ఆయన చేసిన కవితా సంపుటి 'అనిమేష'కు ప్రత్యేక గుర్తింపు పొందడాన్ని రాష్ట్ర జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్, గజ్వేల్ ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్తచట్టం ఉపాధి హామీ కూలీలకు ప్రయోజనకరం కాదు

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 16: కేంద్ర ప్రభుత్వం తెస్తున్న కొత్తచట్టం ఉపాధి కూలీలకు ఎటువంటి ప్రయోజనం లేదని, మహత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు గజ్వేల్ మండలం అనంతరం పల్లి గ్రామంలో సోమవారం నాడు గ్రామ సర్పంచి సులోచన మల్లేష్ యాదవ్, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, ఉపసర్పంచ్ బైరం రమేష్, వార్డ్ మెంబర్ల దార మల్లేశం, మాదుగారి రామకాంత్ ,మంకిడి ప్రభాకర్, దావనమైన కుమార్, గ్రామ పెద్దలు దావుగారి యాదం సమక్షంలో అనంతరావుపల్లిలోని మర్రికుంటలో ఎమ్ ఎ ట్యాంకు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ పనిచేస్తున్న కూలీలకు క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని, పని వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపాధి హామీ పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పని వద్ద కనీస సౌకర్యాలను కల్పించాలని కొరారు. గతంలో ఉపాధి కూలీలు హక్కుగా పనిచేసే వారు ఇప్పుడు వారి దయదాక్షిణ్యాల మిదా అదారపడాల్సివస్తుందన్నారు. కావున ఉపాధి హామీ చట్టాన్ని యదావిదిగా అమలుచేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు నాంపల్లి,రాజు,నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆస ముత్యంకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 16: బహుజన సాహిత్య అకాడమీ సంస్థ చైర్మన్ నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తిరుపతిలో ఆదివారం జరిగిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అవార్డుల కార్యక్రమంలో వివిధ రంగాలలో సామాజిక సేవ చేస్తున్న వారికి ఇచ్చేటువంటి భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డును సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన ఆస ముత్యంకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆస ముత్యం మాట్లాడుతూ పీడిత వర్గాలు, అణగారిన కులాలు, కార్మికుల అభ్యున్నతి కోసం సామాజిక సేవ చేస్తున్న నాకు ఈ అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ ఎలక్షన్ కమిటీ సభ్యులు కుంభాల రవీందర్, గుర్రాల శ్రీనివాస్ లకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 16: మెదక్ జిల్లా రాంపూర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హవేలీఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్, రిషి వర్ధన్ గౌడ్, అలాగే అల్లుడు సాయ్ గౌడ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనపై తీవ్రంగా కలత చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి.తిరుపతి రెడ్డి సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా బోగడా భూపతిపూర్ మరియు బూరుగుపల్లి గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను వారి నివాసాల్లో కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఇరువురు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.ఆయన వెంట స్థానిక నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బకాయి పడ్డ వేతనాలు ఇవ్వాలి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 16: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని, బకాయి పడిన ఐదు నెలల వేతనాలు చెల్లించాలని ముంపు గ్రామాల కార్మికులకు మున్సిపల్ జీవో ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం నాడు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్ కళ్యాణ్ కార్ పద్మా బాయ్ లకు వినతి పత్రం సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని ముంపు గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ కవి నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 16: ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు , తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిద్ధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధారెడ్డి రచించిన "అనిమేష" కవితా సంపుటికి వచన కవిత్వం విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడం తెలంగాణ సాహిత్యానికి గొప్ప గౌరవమని తెలిపారు.తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుల్లో నందిని సిద్ధారెడ్డి ఒకరని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన ఆయనకు ఈ అవార్డు రావడం జిల్లా ప్రజలకు గర్వకారణమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా నందిని సిద్ధారెడ్డి కి ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచి సామాన్యుని నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 16: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వం యుద్ధం సాకుతోని గ్యాస్ ధర పెంచొద్దని అలాగే సామాన్య ప్రజలకు గ్యాస్ అందుబాటులో ఉంచాలని కోరుతూ సోమవారం నాడు స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగం కృష్ణ, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద చర్యలకు వ్యతిరేకంగా అలాగే ఇరాన్ పైఆదిపత్యం కోసం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని దీనివల్ల ప్రపంచ శాంతికి భంగము కలుగుతుందని కాబట్టి అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దేశము ఇరాన్ పై జరుపుతున్న దాడుల వల్ల ప్రపంచంలో అత్యంత విలువైనటువంటి ఆయిల్ నిల్వలు కాలిపోవడం వల్ల మొత్తం ప్రపంచానికే విఘాతమన్నారు. వెంటనే యుద్ధాన్ని ఆపాలని, అలాగే మనదేశంలో యుద్ధం వల్ల ఆయిల్ కొరత పై దేశ ప్రధాన మంత్రి కూడా అమెరికా పైన ఒత్తిడి పెంచి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నం చేయాలని, అలాగే దేశంలో గ్యాస్ కొరతను ఎదుర్కోవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పార్టీ వీటికి నిరసనగా మండల కేంద్రాల్లో ధర్నాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మొట్ట శ్రీను గజ్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడుటంపచంద్రం శీను, సిపిఐపార్టీనాయకులు పోతుల శంకరయ్య నర్సింలు రాజు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర సర్కార్

- గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చి 16: గ్రామీణ ప్రాంత కూలీలు, నిరుపేద రైతుల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి విమర్శించారు. వర్గల్, తునికి ఖల్సా, తునికి మక్త, మీనాజీపేట్, శాకారం, అంబర్ పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో విధానసభలు ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చాలనే దుర్బుద్ధితో "విబిజి రాంజీ" పేరుతో కేంద్ర నిధుల్లో కోత విధించి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర సర్కార్ 40 శాతం నిధులు సమకూర్చాలని పేర్కొంటున్నట్లు ఎద్దేవా చేశారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులు, వ్యవసాయ అనుబంధ పనులు తొలగించి జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. అయితే నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలు, గిరిజనులు, కార్మికుల ఉపాధి కరువైన సందర్భంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టి కడుపు నింపినట్లు ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, సర్పంచులు, ఉప సర్పంచ్లు విజయలక్ష్మి యాదగిరి, కొండగళ్ల గణేష్, కుమార్ యాదవ్, కుమార్, గోరెమియా, టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల లక్ష్మి, సహదేవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, నేతలు గంగుమల్ల కొండల్ రెడ్డి, నీల శ్రీనివాస్, పాషా భాయ్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి పాల్గొన్నారు.

“

అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దు. అనవసర వివాదాల్లో ఇరుక్కోవద్దు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజ్ ఉండదు. అది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుంది. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుంది. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాపే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుంది.

- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్

ప్రాంతీయం

పంటలను పరిశీలించిన వ్యవసాయ విస్తరణ అధికారి

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 16: తొగుట మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపేట్ గ్రామంలో వరి పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గట్లపై గడ్డిని తొలగించడానికి పారాక్వాట్ కలుపు మందు వినియోగిస్తున్నారని, పారాక్వాట్ అన్ని మందులతో పోలిస్తే చాలా విషపూరితమైనది పర్యావరణానికి మరియు మనుషులకు హాని కలిగె అవకాశం అధికంగా ఉందని కావున రైతులు పారాక్వాట్ బదులుగా గ్లూఫోసినేట్ అమ్మోనియం వినియోగించాలి అని సూచించారు. గ్లూఫోసినేట్ అమ్మోనియం పారాక్వాట్ తో పోలిస్తే తక్కువ విషపూరితమైనది పారాక్వాట్ డైక్లోరైడ్ లాగానే గ్లూఫోసినేట్ అమ్మోనియం కూడా నాన్ సెలెక్టివ్ కాంటాక్ట్ హెర్బిసైడ్ అంటే ఏదో ఒక రకం కలుపు మొక్కనో లేదా ఏవో కొన్ని రకాల కలుపు మొక్కల్నో నిర్మూలించడానికి ఉద్దేశించింది కాదు. ఇది తాకిన అన్ని ఆకుపచ్చ మొక్కల కణజాలాలను చంపుతుంది లేదా దెబ్బతీస్తుందని వేగంగా పనిచేసే రసాయనం. పొలం గట్లు, మరియు తోటలలో మొలిచే గడ్డి, వెడల్పాటి ఆకు కలుపును ఇది సమర్థవంతంగా నివారిస్తుంది. ఇది పిచికారీ చేసిన 23 రోజుల్లోనే కలుపు మొక్కలను ఎండిపోయేలా చేస్తుందని పేర్కొన్నారు.

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు.. అవి కొక్కెర వ్యాధి లక్షణాలు

- పలు కోళ్ల ఫారాలను తనిఖీ చేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చ్ 16: జిల్లాలలో పలు పత్రికలలో బర్డ్ ఫ్లూ భయం అనే కథనానికి పశుసంవర్ధక శాఖ అధికారి స్పందిస్తూ పాపన్నపేట, కొల్చారం పౌల్ట్రీ ఫార్మ్స్ ఆయన పరిశీలించడం జరిగిందిని .డాక్టర్ వెంకటయ్య తెలిపారు, జిల్లాలోని పాపన్నపేట కౌడిపల్లి మండలాల్లో పర్యటించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. పాపన్నపేట మండలం కొత్త లింగయపల్లి గ్రామానికి చెందిన కదాలి ప్రవీణ్ గౌడ్ (2) పౌల్ట్రీ షెడ్ (5000కెపాసిటీ) ను పశు వైద్య సహాయకులు డా. ప్రవీణ్. సూపర్డెంట్ యాదగిరి వెటరినరీ సిబ్బంది సందర్శించడం జరిగిందని,. 20 రోజుల క్రితం విడతల వారీగా సుమారు 800 నుండి 1000 కోళ్ళు చనిపోయాన్నందువలన షెడ్ లో ఉన్న అన్నీ కోళ్లను సదరు కంపెనీ వారు అప్పుడే అమ్మి వేయడం జరిగినది. ప్రస్తుతము షెడ్ లో ఎటువంటి కోళ్ళు లేవు. స్థానిక పశు వైద్య సహాయకుడి కథనం ప్రకారం ఇట్టి షెడ్ లలో బర్డ్ ఫ్లూ కి సంబంధించిన ఎటువంటి లక్షణాలు లేవన్నారు . జిల్లాలో కొక్కెర వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనపడుతున్నాయి. కావున మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి లేదని వెల్లడించారు. అన్నీ పౌల్ట్రీ షెడ్ యాజమాన్యాలకు అప్రమత్తం గా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందులో భాగంగా పౌల్ట్రీ షెడ్ యజమానులు తమ వ్యాపారాలపై ప్రభావం చూపుతుందనే భయంతో కోళ్ళు చనిపోతుందన్న సమాచారాన్ని దాచిపెట్టకూడదు అని అధికారులకు వెంటనే తెలియచేయాలి అని సూచించారు. కోళ్లలో ఆకస్మిక మరణాలు సంభవిస్తే స్థానికవెటరినరీ డాక్టర్ కు వెంటనే తెలియచేయాలి. షెడ్ లను ఎప్పటికప్పుడూ బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రంగా ఉంచుకోవాలి, షెడ్ లోపల సానిటైజేషన్ చేపించకోవాలి. షెడ్ లోకి కొత్త వ్యక్తులను అనుమతించకూడదు. వేసవి కాలంలో ఎండల తీవ్రత వలన కోళ్లలో వ్యాది నిరోధక శక్తి తగ్గి కొకెర వ్యాధి మరియు కాకసిడీయే వ్యాదులు వచ్చే అవకాశం ఉన్నందున వేసవి కాలంముగిసే అంత వరకు కొత్తగా కోళ్లను తీసుకోరాకుడదు అని సూచించడం జరిగినది. ఉన్న కోళ్లను త్వరగా అమ్మివేయాలని సూచయిచ్చారు. ఎండల తీవ్రత అధికం గా ఉన్నందు వలన షెడ్ లలో ఉన్న కోళ్ళకు నీరు ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి మరియు షెడ్ చల్లని వాతావరణం ఉండే విధం గా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని పౌల్ట్రీ షెడ్ యజమానులకు సూచించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి!

- సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ కార్యదర్శి బొడ్డు నర్సింలు

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 16: తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి బొడ్డు నర్సింలు యాదవ్ పేర్కొన్నారు.. జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సర్వీ యాదయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ల తో కలిసి అసెంబ్లీ ముట్టడిని ప్రయత్నించామని పేర్కొన్నారు.. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా మంత్రులు ఎమ్మెల్యేలు అఖిలపక్ష ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం గ్రామ పంచాయతీ నిధులను న్యాయంగా మాజీ సర్పంచులు విడుదల చేయాలనీ తెలిపారు.. మాజీ సర్పంచులకు తాజా సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు పైసల పంచాయితీ మొదలై అనేక ఇబ్బందులు మాజీ సర్పంచులు పడుతున్నారన్నారు..ఇప్పటికి సర్పంచుల బిల్లులు రాక వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నవని కొంతమంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని,కొంతమంది సర్పంచ్ తెచ్చిన రూపాల వడ్డీలు పెరిగి అప్పులవారికి తల దాచుకునే పరిస్థితిలో ఉన్నరు అని తెలిపారు..నూతనంగా ఎన్నికైన సర్పంచులు స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ సెక్రెటరీ వచ్చిన డబ్బులను తీసుకోవడం వల్ల మాజీ సర్పంచులు చలో అసెంబ్లీ పోరుబాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు ఇదేనా ప్రజా పాలన ఇదేనా ప్రజా ప్రభుత్వం ఈ ప్రజా ప్రభుత్వంలో మాజీ సర్పంచులకు న్యాయం లేదా కనీసం మా బిల్లులు చెల్లించాలని మేం ప్రభుత్వాన్ని అడుగుతే అక్రమ అరెస్టులు నిర్బంధాలు తో మా గొంతును నొక్కడం సరైనది కాదని ఇకానైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క మా బిల్లులు చెల్లించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు..వివిధ జిల్లాలలో అరెస్ట్ అయిన సర్పంచులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని,అరెస్టులతో మా గొంతును నొక్కాలని ఈ ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ఇలాంటి అరెస్టులకు మేము భయపడేది లేదని మా బిల్లులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం రాష్ట్ర జే ఏసీ ప్రధాన కార్యదర్శి రాపాక నాగయ్య, జేఏసీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశ బోయిన మల్లయ్య, మంగ నరసింహులు,మోడం విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- సిద్దిపేట్ జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 16: రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయం లో ఏర్పాటుచేసిన సమావేశంలో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న జగదేవ్ పూర్ మండలం చెబర్తి, అలాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గూర్చి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామంటూ ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న తమకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్ర కళ, తహసిల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఈత సరదా తల్లిదండ్రులకు విషాదంగా మారొద్దు

- పిల్లలను ఒంటరిగా ఈతకు పంపొద్దు
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 16: పిల్లలకు ఒంటిపూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటన ద్వారా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు.సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. పిల్లలకు నీటి లోతు తెలియకపోవడం వల్ల జారి నీటిలో పడిపోయే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల పట్ల తల్లి దండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని చదువు లేదా ఇతర మంచి విషయాలు నేర్పించాలని ఆయన సూచించారు.

బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ ప్రసన్న కుమార్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 16: ట్రాన్స్ జెండర్లు ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఉండాలని, శుభకార్యాలకు వెళ్లి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ హెచ్చరించారు. సోమవారం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్స్‌లో ట్రాన్స్ జెండర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమాన భాగస్వాములేనని, వివిధ గ్రామాలు, ఏడుపాయల ప్రాంతాల్లో జరిగే శుభ కార్యాలకు వెళ్లినప్పుడు ఇష్టారీతిన డబ్బులు డిమాండ్ చేయవద్దని సూచించారు.ప్రజలతో గౌరవంగా ప్రవర్తించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి హేమభార్గవి , సీఐ జార్జ్, ఎస్ఐ శ్రీనివాస గౌడ్ , వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- సీఐటీయూ జిల్లా కోశాధికారి జి భాస్కర్

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 16: అంగన్వాడి టీచర్లు ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో అంగన్వాడి టీచర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి భాస్కర్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ నుండి అక్టోబర్ 4 వరకు 24 రోజులు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారనీ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు రూ. 18,000/ ల వేతనం పెంచుతామని,పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చి నేటికి వేతనాలు పెంచలేదనీ విమర్శించారు.24 రోజుల సమ్మె వేతనాలు, దైర్మెంట్ బెనిఫిట్స్, మిని టీచర్స్ ఎరియర్స్, పిఆర్సి ఎరియర్స్ తదితర డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉండడం వల్ల అంగన్వాడీ ఉద్యోగులు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారనీ తెలిపారు.ఖాళీ పోస్టుల భర్తీ తదితర సమస్యలు పెండింగ్లో ఉన్నాయనీ వీటన్నింటినీ పరిష్కరించే విధంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎన్ఐపి2020 చట్టాన్ని కూడా వ్యతిరేకిస్తూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో తెచ్చిన 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించాలని, మే 1 నుండి 31 వరకు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు ఇద్దరికి ఒకేసారి మే నెలంతా సెలవులు అమలు చేయాలనీ,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు గ్రాట్యుటీ చెల్లించాలనీ,రిటైర్మెంట్ బెనిఫిట్ అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష వెంటనే చెల్లించాలనీ,ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయాలనీ కోరారు.ప్రైమరీ పిఎంశ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ,విజయలక్ష్మి, యశోద, సుజాత,రత్న, నాయకులు ఎం డి .సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సెక్రటరీ నాగరాజుకు ఉత్తమ సేవా అవార్డు

- అవార్డు అందజేసిన మెదక్ ఎంపీ

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 17: చేగుంట లయన్స్ సెక్రెటరీ పులబోయిన నాగరాజు ముదిరాజ్ కు ఉత్తమ సేవ అవార్డు లభించింది. లయన్స్ క్లబ్ రీజినల్ మీట్ లో ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ సంజయ్ గుప్తా మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. సంవత్సర కాలంలో మెదక్ జిల్లా చేగుంట లయన్స్ క్లబ్ చేపట్టిన 210 సేవా కార్యక్రమాలకు గాను 14 అవార్డులు అందుకున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకటించిన అవార్డులను ప్రధానం చేసినట్లు నాగరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు తో పాటు రీజనల్ చైర్మన్ సంజయ్ గుప్తా ఇంటర్ నేషనల్ డైరెక్టర్ బాబురావు చేగుంట లైన్స్ క్లబ్ ప్రతినిధులు శంభుని శ్రీనివాస్ నాగేశ్వరరావు రాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో వంటగ్యాస్ కొరత

- సిలిండర్ల కోసం వినియోగదారుల బారులు
- బుక్ చేసి రోజులు గడిచినా సరఫరా లేదు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 16: మెదక్ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేసినప్పటికీ సమయానికి సరఫరా కాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా రెండు నుంచి మూడు రోజుల్లో అందే సిలిండర్లు ప్రస్తుతం 7 నుంచి 10 రోజులు, కొన్నిచోట్ల 15 రోజుల వరకు ఆలస్యంగా వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 3.85 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నప్పటికీ అవసరానికి సరిపడా సిలిండర్లు సరఫరా కావడం లేదని తెలుస్తోంది. మెదక్ పట్టణంతో పాటు పలు మండలాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా ఉండటంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు భారీగా చేరి బారులు తీరుతున్నారు.గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.గ్యాస్ కొరత కారణంగా అనేక కుటుంబాలు తాత్కాలికంగా కట్టెల పొయ్యి, విద్యుత్ స్టౌలు వంటి ప్రత్యామ్నాయాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గృహ అవసరాలకు మాత్రమే కాకుండా చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు కూడా గ్యాస్ కొరత వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సరఫరా ఆలస్యం కారణంగా వారి వ్యాపారాలపై కూడా ప్రభావం పడుతోందని వ్యాపారులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ లో అధిక ధరలకు గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారిక ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు, ఆయిల్ కంపెనీలు సమస్యను వెంటనే పరిష్కరించి జిల్లాకు అవసరమైన సిలిండర్లను తగినంతగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ కొరతపై అధికారులు దృష్టి సారించి వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

డ్రగ్స్ మూలాలు సినీ పరిశ్రమలోనే ఎక్కువగా ఉన్నాయి. యాక్టర్లు డ్రగ్స్ టెస్ట్ చేయించుకుంటేనే సినిమాలు రిలీజ్ చేయాలి. టెస్టుకు నిరాకరిస్తే విడుదలను ఆపేయాలి. ప్రజాప్రతినిధులూ 90 రోజులకోసారి డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి. లేదంటే చట్ట సభలోకి అనుమతించొద్దు.
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ప్రాంతీయం

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయండి

- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దు
- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 16: ముఖ్యమంత్రి బహిరంగ సభకు సుమారు 30 వేల మంది హాజరవుతారని, ముఖ్యమంత్రి పర్యటనలో ఇలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 22 వ తేదీన హెలికాప్టర్ (చాపర్) ద్వారా ఆయిల్ పామ్ పరిశ్రమ వద్దకు చేరుకుంటారని, అదే రోజు జిల్లా జైలు భవనాన్ని ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ హైమావతి కె. హైమావతి చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలోని టీజీ ఆయిల్ ఫెడ్ ఆయిల్ ఫామ్ పరిశ్రమను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్చి 22 ఆదివారం నాడు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయిల్ ఫామ్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సిపి సాధన రష్మీ పెరుమాళ్ లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, . వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక తదితర శాఖలచే 120 స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు ఫ్యాక్టరీ ఆవరణలో రైతు మహోత్సవం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతు మహోత్సవంపై వ్యవసాయ శాఖతో సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతు మేళాకు ప్రతీ రోజు మూడు వేల నుండి ఐదు వేల మంది రైతులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. వారికి తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని డీపీఓకు సూచించారు. వైద్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని చెప్పారు. తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిబంధనలకు అనుగుణంగా చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ ప్రారంభం సందర్భంగా భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ఇందుకోసం 600 బస్సుల్లో సుమారు 30 వేల మంది హాజరు అవుతారని చెప్పారు. ఇందుకోసం తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా చేయడంతో పాటు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే సమగ్రంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ ముందుగానే తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాజాత ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రతా దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమానికి విధులు నిర్వహించే సిబ్బంది అందరూ పోలీస్ శాఖ ద్వారా జారీ చేసే ఐడీ కార్డులు తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. మీడియా ప్రతినిధుల కోసం కూడా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ స్థలాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హెలిప్యాడ్, సభాస్థలి ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు, అధికారులు, విఐపీ ల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, అదనపు డీసీపీ లు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట , వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, పంచాయతీ, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, సమాచార పౌర సంబంధాల శాఖ, ఆయిల్ ఫెడ్, ఫైర్ సేఫ్టీ, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 16: హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సుబేదారి జిల్లాఖజానా శాఖ కార్యాల ప్రాంగణంలో సోమవారం జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా హాజరైన హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చాహత్ బాజ్ పాయ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఈ గొప్ప సేవా కార్యక్రమమైన రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన జిల్లా పరిపాలన అధికారులకు అభినందనలు తెలిపారు. రక్తదానం అనేది మనం మానవత్వానికి అందించగల అత్యున్నత సేవలలో ఒకటి ఒక యూనిట్ రక్తం అనేక అమూల్యమైన ప్రాణాలను కాపాడగలదు. ప్రత్యేకంగా వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని, అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడుతున్నరని తెలిపారు. ముఖ్యంగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆరోగ్యంగా జీవించడానికి తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుందన్నారు. వారికి రక్తం అనేది కేవలం అవసరం మాత్రమే కాదు, అది నిజంగా వారి ప్రాణాధారమన్నారు. ఈ సందర్భంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు నిర్వహించడం ప్రజల్లో అవగాహన కల్పించడం, అవసరమైన వారికి సమయానికి రక్తం అందేలా చూడడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవ నిజంగా మానవతా సేవగా నిలుస్తోందని, అందువల్ల యువత సేవా సంస్థలు మరియు ఎన్‌జీవోలు ముఖ్యంగా వేసవి కాలంలో నియమితంగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. సమాజంలో మంచి మార్పు తీసుకురాగల శక్తి, ఉత్సాహం మరియు దయ యువతలో ఉన్నాయి రక్తదానం పూర్తిగా సురక్షితమైనది, సులభమైనది మనం ఎవరో ఒకరి ప్రాణాన్ని కాపాడుతున్నామనే ఆనందం అపారమైన తృప్తిని ఇస్తుంది. కాబట్టి మనమంతా కలిసి రక్తదానంపై అవగాహన పెంచుతూ ఎక్కువ మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహిద్దాం ఈ రక్తదాన శిబిరం లోహనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరు వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి : అకవారం శ్రీనివాస్ కుమార్, టి. ఎన్. జి. ఓ. ప్రెసిడెంట్ : ఆకుల రాజేందర్, టి. జి. ఓ. రాష్ట్ర ఉపాధ్యక్షుడు : జగన్ మోహన్ రావు, ఉద్యోగ సంఘ నేతలు : బైరి సోమయ్య, డా. ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, కోలా రాజేష్ కుమార్, మాధవ రెడ్డి, లక్ష్మి ప్రసాద్, విజయలక్ష్మి, కిరణ్, శ్యామ్ సుందర్, ఫణికల రాజేష్, యం. ఆర్. ఓ లు : బాపు సింగ్, జగన్ మోహన్ రెడ్డి, ఖజానా శాఖ సిబ్బంది : శ్రీనివాస్ రెడ్డి, అన్వర్, చంద్ర శేఖర్, దయాకర్, ప్రసాద్, ఉదయ్ భాస్కర్ మరియు ఉద్యోగ సంఘాలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేశారు.

బహుజన సాహిత్య అకాడమీ సేవారత్న నేషనల్ అవార్డు అందుకున్న ఓదెల సురేష్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ తిరుపతి సంఘ సేవ సోషల్ వర్కర్ నేషనల్ అవార్డు 2026 ఓదెల సురేష్ అందుకున్నారు. మార్చి 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ లో తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ బి ఎస్ ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ & జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. సుబ్రమనియన్ గారి చేతుల మీద అవార్డు అందుకున్నారు ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టి బీసీ మైనారిటీ సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన జాతీయ సాహిత్య అకాడమీ ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు సంఘ సేవకులకు రచయితలకు కవులకు స్వచ్ఛంద సంస్థలకు ఈ యొక్క అవార్డు అందచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఈ అవార్డు అందజేసిన వారితోపాటు సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ జి విష్ణు. వర్ధన్ కమిటీ సభ్యులు తాటికంటి ఐలయ్య. బాదే వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మట్టి సాహిత్యాన్ని వరించిన పురస్కారం

- డాక్టర్ నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పట్ల మరసం హర్షం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 16: తెలంగాణ సాహిత్య ప్రపంచానికి గర్వకారణమైన సందర్భం ఏర్పడింది. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్, ప్రముఖ కవి, ఆలోచనాపరుడు అయిన నందిని సిధారెడ్డి గారి "అనిమేష" కావ్యానికి సాహిత్య అకాడమీ (కేంద్ర సాహిత్య అకాడమీ) పురస్కారం ప్రకటించడం తెలుగు సాహిత్య వర్గాలలో విశేష ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ నందిని సిధారెడ్డి గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాట్లాడారు.. "అనిమేష" కావ్యం సమకాలీన భావజాలాన్ని ప్రతిబింబిస్తూ మానవ అనుభూతులను లోతుగా ఆవిష్కరించిన ప్రాముఖ్యమైన కృతి. ఈ కావ్యంలో కవి సమాజం, సంస్కృతి, మానవ విలువలు, తెలంగాణ భూభాగపు ఆత్మను సున్నితమైన కవిత్వ రూపంలో వ్యక్తపరిచారు. పద ప్రయోగంలో ఉన్న కవిత్వ సౌందర్యం, భావగాంభీర్యం, అంతర్లీనమైన తాత్వికత ఈ కావ్యాన్ని ప్రత్యేక స్థాయికి చేర్చాయి. ఈ కృతికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లు అయింది. ఈ సందర్భంగా మంజీరా రచయితల సంఘం నాయకులు మాట్లాడుతూ, నందిని సిధారెడ్డి గారు తెలంగాణ సాహిత్య అభివృద్ధికి విశేష సేవలు అందించిన మహత్తర సాహితీవేత్త అని పేర్కొన్నారు. కవి, విమర్శకుడు, సాహిత్య ఉద్యమకారుడిగా ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్య రంగానికి గొప్ప ప్రేరణగా నిలిచిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ భావజాలాన్ని ప్రతిబింబించే రచనల ద్వారా ఆయన సాహిత్యానికి ప్రత్యేకమైన దిశను చూపించారని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కే. రంగాచారి, ప్రధాన కార్యదర్శి డా. సిద్దెంకి యాదగిరి మాట్లాడుతూ నందిని సిధారెడ్డి గారి ఈ విజయాన్ని తెలంగాణ సాహిత్యానికి గౌరవప్రదమైన ఘట్టంగా అభివర్ణించారు. ఆయనకు లభించిన ఈ అవార్డు యువ రచయితలకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తోట అశోక్, ఎన్. భగవాన్ రెడ్డి, పప్పుల రాజిరెడ్డి, పొన్నాల బాలయ్య, పాపయ్య, కొమురవెల్లి అంజయ్య, రాజు, అలాజ్ పూర్ శ్రీనివాస్, తైదల అంజయ్య, తిరుపతిరెడ్డి, బుచ్చి రాజ్యం రెడ్డి తదితరులు పాల్గొని నందిని సిధారెడ్డి గారికి అభినందనలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ, సాహిత్యం సమాజాన్ని చైతన్యపరిచే శక్తివంతమైన సాధనం అని, నందిని సిధారెడ్డి గారి రచనలు ఆ దిశగా ఎంతో ప్రభావాన్ని చూపిస్తున్నాయని పేర్కొన్నారు. మొత్తానికి, "అనిమేష" కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం తెలంగాణ సాహిత్యానికి ఒక విశిష్ట గౌరవంగా నిలిచింది. ఈ సందర్భంగా మంజీరా రచయితల సంఘం తరఫున నందిని సిధారెడ్డి గారికి మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆయన నుంచి మరిన్ని విలువైన సాహిత్య కృతులు వెలువడాలని ఆకాంక్షించారు.

గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 16 : సిద్దిపేట జిల్లా పరిధిలోని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్ పట్టణానికి చెందిన జ్యోతి (32) అనే మహిళ గత కొంతకాలంగా కుడి భుజంపై పెద్ద కణితి (ట్యూమర్) సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆమె గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని ఒక బృందంగా ఏర్పడిన వైద్యులు సుమారు 750 గ్రాముల బరువున్న భారీ ట్యూమర్‌ను (నియోప్లాజమ్) విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటున్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, "పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యం అంటూ శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడం వల్ల డీఎన్ఏ మార్పులు, రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ట్యూమర్లు ఏర్పడతాయన్నారు. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి బయాప్సీ వంటి పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన జనరల్ సర్జన్ డా. ప్రేమ్ కిషోర్, అనస్థీషియా నిపుణులు డా. మహిపాల్, డా. ఇస్రత్, ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్, స్టాఫ్ నర్సులు రాజు, పవని, ఆస్మాను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాలో మక్క కొనుగోలు కేంద్రాలు

వెంటనే ఏర్పాటు చేయాలి

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 16: జిల్లాలో రైతులు పండించిన మక్క పంటకు సంబంధించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఎంపీ అర్వింద్ ధర్మపురి లేఖ రాశారు. జిల్లాలో ఈ సంవత్సరం పెద్ద ఎత్తున మక్క పంట పండిందని, అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1700 నుంచి రూ.1800 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని వల్ల ప్రతి రైతు సగటున రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు నష్టపోతున్నారని ఎంపీ తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. అలాగే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, మక్క కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 16 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్ లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇదిలా ఉండగా, ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు కొంత ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్, ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ప్రైవేటు కళాశాలల సిబ్బంది నిరసన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 16 : ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని ప్రవేటు కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ప్రైవేట్ కళాశాలల సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టి వెంటనే ప్రభుత్వం స్కాలర్షిప్ డబ్బులను విడుదల చేసి తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు రాకపోవడంతో తమకు తమ కళాశాలలు గత ఆరు నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. ప్రస్తుతం తమకు పూట కూడా గడవడం కష్టం అవుతుందని అధ్యాపక, సహాయక సిబ్బంది బాధపడ్డారు. ముస్లిం మైనార్టీ సిబ్బంది రంజాన్ పండుగ ముందు చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేస్తే తమకు కళాశాలలు జీతభత్యాలు చెల్లిస్తే రాబోయే పండుగను సంతోషంగా చేసుకుంటామని లేకపోతే ఈ పండుగకు కూడా పస్తులు ఉండాల్సిందేనని తమ అశక్తతను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి తమల్ని ఆదుకోవాలని ప్రవేటు కళాశాల సిబ్బంది ప్రభుత్వానికి విన్నపం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్, దేవారెడ్డి, అనురాధ, కౌసర్ బేగం, సందేశ్, సందీప్, చందన్ సింగ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

"

యుద్ధ ప్రభావంతో వివిధ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఇబ్బందులు వస్తున్నాయి. యుద్ధ ప్రభావం దేశంపై పడకుండా ప్రధాని మోడీ చర్యలు చేపడుతున్నారు. కష్టకాలంలో కుంగిపోకుండా సమష్టిగా పనిచేయాలి. అభివృద్ధి ఆగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పొట్టి శ్రీరాములు వంటి వారి త్యాగాలను గుర్తు తెచ్చుకొని రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి
30శాతం నిధులు కేటాయించాలి

- విద్యాశాఖ మంత్రినీ తక్షణమే నియమించాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 16 : ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్యలో నిర్మితమవుతుందని గొప్ప మహనుభాలు చెప్తుంటారు. అలాంటి తరగతులకు విద్యార్థులను దూరం చేసి దేశ భవిష్యత్తును నాశనం చేయకుండా ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించే విధంగా ఈ బడ్జెట్ సమావేశాలలో చర్చించి దేశ భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తరువాత BRS ప్రభుత్వం మొదటి సంవత్సరం మాత్రమే విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 14 శాతం నిధులు కేటాయించారు. అది కాస్త రానున్న రోజుల్లో 6 శాతానికి తగ్గించడం అనేది చాలా దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకన్న ముందు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కేవలం 7.8 శాతం మాత్రమే కేటాయించడం జరిగిందన్నారు. కాబట్టి ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ బడ్జెట్ సమావేశాలలో చర్చించి 30 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృధి చేసే దిశగా ఉండాలన్నారు. ప్రభుత్వ విద్యారంగం మొత్తం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి నియమించక పోవడం ఎంటన్నారు. విద్యార్థులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ దాదాపు 8వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నటువంటి పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని పై చదువుల కోసం సర్టిఫికెట్ కోసం కాలేజీల చుట్టూ ఎంత తిరిగిన ఇవ్వకపోవడంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లకుండా డ్రాప్ అవుట్ అవుతున్న పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్నదన్నారు. కాబట్టి ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ బడ్జెట్ సమావేశాలలో చర్చించి తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు, కెవిపిఎస్, జిల్లా కార్యదర్శి అశోక్, సిఐటియు నాయకురాలు మంజుల, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు కెవిఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

అంగన్వాడి చలో హైదరాబాద్‌ను అడ్డుకున్న పోలీసులు

- అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు
- అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 16 : అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ సందర్భంగా ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నా జయప్రదం కోసం వెళుతున్న సిఐటియు నాయకులను, అంగన్వాడి టీచర్ల హెల్పర్లను పటాన్ చెరు పోలీస్ లు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వము అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని మండిపడ్డారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రశాంతంగా చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా ఇలాంటి అక్రమ అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు పోలీసులు అనుమతి ఇచ్చిన అరెస్టు చేయడం దారుణమన్నారు. అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత వేసవికాలం బడ్జెట్ సమావేశాలలో ఐసిడిఎస్ పరిరక్షణ కోసం తగిన నిధులు కేటాయించి ఐసిడిఎస్ ను రక్షించాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా శిశు సంరక్షణ, గ్రామస్థాయిలో అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా నడుపుతున్నారని, బిఎల్ఓ డ్యూటీలను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వచ్చే 13600 రూపాయలు టీచర్లకు, ఆయాలకు 7500 ఎక్కడ సరిపోవడం లేదని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో టీచర్లకు ఆయనకు కనీస వేతనం 18 వేల రూపాయలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణ కోసం అనేక సెంటర్లు ఖాళీలు ఉన్నాయని, వెంటనే టీచర్ల ఆయాల పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అనేకమంది ఆయాలు రిటైర్మెంట్ అవుతున్న నేటికీ బెనిఫిట్స్ అందడం లేదని గుర్తు చేశారు. మార్చి 16 నుండి సగం పూట బడులు నిర్వహణ జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలని, మే నెలలో అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేడు చలో హైదరాబాద్ సందర్భంగా వేలాది మందిని అక్రమ అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అక్రమ అరెస్టుల విషయంలో అనేక సందర్భాల్లో ఖండించిన విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని, అంగన్వాడీ టీచర్ల హెల్పర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మంజుల, విజయలక్ష్మి, అనిత, రాణి, లక్ష్మి, గాయత్రి, అక్షద, కృష్ణవేణి, స్వరూప, మందాకిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 16: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ పాండు అన్నారు . సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలిసి ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

- యుద్ధ ప్రభావం ప్రతి ఒక్కరిపై పడుతుంది
- భారత ప్రధాని మౌనం వీడాలి
- సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 16 : అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకుడు కామ్రేడ్ చుక్క నర్సయ్య 12వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి లోని కేవల్ కిషన్ భవన్లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. యుద్ధం వల్ల అన్ని దేశాలపై ప్రభావం పడుతుందని చమురు ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై భారాలు పడతాయన్నారు. అమెరికా చేస్తున్న యుద్ధం పై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం ఏమిటని మౌనాన్ని వీడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని నూతన చట్టాలు తీసుకువచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని తిప్పి కొట్టేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ కె. రాజయ్య ఎం. నర్సింలు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం యాదగిరి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. బాగారెడ్డి జిల్లా నాయకులు పి అశోక్ బాలరాజ్ నాయకులు ప్రసన్న మల్లారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి శివ సతీష్ మహేష్ లక్ష్మణ్ ప్రవీణ్ ప్రభాకర్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లీప్ స్పేస్‌పై గీతంలో శిక్షణ

- ప్రధాన వక్తగా పాల్గొన్న ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 16 : గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాదులోని విజ్ఞాన వనరుల కేంద్రం (కే.ఆర్.సీ. లేదా గ్రంథాలయం) ఆధ్వర్యంలో సైన్స్ డైరెక్ట్ ఏఐ సాధనం, లీప్ స్పేస్ పై ఒకరోజు ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరిశోధకుల పండిత సాహిత్యాన్ని మరింత సమర్థవంతంగా కనుగొని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకురాలిగా వ్యవహరించారు. అధునాతన సాహిత్య ఆవిష్కరణ, పరిశోధన అంతర్దృష్టులు, విద్యా సహకారం కోసం సైన్స్ డైరెక్టర్ ఏఐ ఆధారిత ప్లాట్ ఫామ్ లీప్ స్పేస్ ను ఉపయోగించడంపై ఆమె ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు. ఇందులో భాగంగా, లోతైన పరిశోధన అంతర్దృష్టులను రూపొందించడానికి స్కోపస్ డేటా, సైన్స్ డైరెక్టర్ పూర్తిటెక్స్ట్ వనరులను ఈ సాధనం ఎలా ప్రభావితం చేస్తుందో ఆమె వివరించారు. అంశాలను అన్వేషించడం, నిపుణులను కనుగొనడం, నిధుల లభ్యత వంటి కీలక అంశాలు ఈ శిక్షణలో ఉన్నాయి. ఇవి పరిశోధకులు వర్ధమాన పరిశోధనా రంగాలను అన్వేషించడానికి, అలాగే సహకార, నిధుల అవకాశాలను గుర్తించడానికి వీలు కల్పిస్తాయి. అంశాల అన్వేషణలో భాగంగా, సాలిడ్‌స్టేట్ బ్యాటరీ టెక్నాలజీలో పరిణామాలు, మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్ ల ప్రభావం చుట్టూ తలెత్తుతున్న ప్రశ్నలు, సీఆర్ఐఎస్పీఆర్ జన్యు సవరణలో ఇటీవలి పురోగతులు, చర్చలు వంటి ప్రస్తుత పరిశోధనాంశాలను ఆమె వివరించారు. జనరేటివ్ ఏఐ భద్రత, పీఎఫ్ఏఎస్ కాలుష్యం, నివారణ, అలాగే భారీ భాషా నమూనాల (ఎల్ఎల్ఎం) మూల్యాంకన పరిశోధన వంటి రంగాలలో అగ్రశ్రేణి రచయితలు, పరిశోధకులను గుర్తించడంపై శివాలికా మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయంలో ప్రారంభ దశ పీఎఫ్ఏఎస్ పరిశోధనకు మద్దతు ఇచ్చే సంభావ్య గ్రాంట్లను, మైక్రోప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యంపై అధ్యయనాలు, ఓపెన్ సైన్స్, పరిశోధన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే చొరవలను గుర్తించడంలో పరిశోధకులకు సహాయపడే 'ఫైండ్ ఫండింగ్ ఫీచర్'ను కూడా ఆమె వివరించారు. తొలుత, గీతం చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు ఎల్స్ వియర్ ఎలా మద్దతు ఇస్తోందీ ఆ సంస్థకు చెందిన ప్రణవ్ శుక్లా వివరించారు. గీతంలోని వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కే.ఆర్.సీ. డైరెక్టర్ ఎస్.పి.ఎ. బాలసుబ్రమణియన్, ఉప గ్రంథపాలకుడు కె. రామకృష్ణల పర్యవేక్షణలో ఈ ఆచరణాత్మక ఆన్ లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, సహాయ గ్రంథపాలకుడు కె. దుర్గాప్రసాద్ సమన్వయం చేశారు.

ఎల్ వో సీ అందజేత

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 16 : అనారోగ్యంతో బాధ పడుతున్న ముగ్గురికి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సోమవారం ఎల్ వో సీ పత్రాలను పంపిణీ చేశారు. కమ్మర్పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన గుండెబోయిన శ్రీకాంత్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స కోసం రూ. 2 లక్షల విలువ గల ఎల్ వో సీ ను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ పాషా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స కోసం రూ. 2లక్షల 80వేలు, కిడ్నీ డోనర్‌గా ఉన్న మహమ్మద్ ఖాజాకు వైద్య ఖర్చుల కోసం రూ. 2 లక్షల 40 వేలు విలువ గల పత్రాలను హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స కొరకు ఎల్ వో సీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాతృమూర్తిని
పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 16 : గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాతృమూర్తి గూడెం మాణెమ్మను సోమవారం ఉదయం మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. హరీశ్‌రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి , నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో పాటు వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.

సంప్రదాయ కళలకు ప్రోత్సాహం

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కంజర డప్పులు వితరణ

ప్రతిపక్షం, గుండాల, మార్చి 16: నేతకాని కుల సంఘం గుండాల మండల కమిటీకి ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం గుండాల మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం పది కంజర డప్పులను వితరణ చేశారు. ఈ సందర్భంగా నేతకాని కుల సంఘం మండల అధ్యక్షులు నిత్యానందం మాట్లాడుతూ తమ సంఘానికి 10 కంజర డప్పులను అందజేసిన మానాల వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం సంఘ కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు మానాల శ్రవణ్ కుమార్, మానాల ప్రణీత్ , తవిడిశెట్టి నాగరాజు, తవిడిశెట్టి రాంబాబు, మానాల ఉపేందర్, గోలి కిరణ్, నేతకాని కుల సంఘం సభ్యులు జనగం అశోక్, మల్లయ్య, పాపయ్య, సాయిలు, రమేష్, వినయ్, రామటేంకి అనిల్ కుమార్, చెన్నూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- ఎస్పీ రోహిత్ రాజు

ప్రతిపక్షం, కొత్తగూడెం, మార్చి 16: బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి సత్వర పరిష్కారానికి అధికారులు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. క్రికెట్ బెట్టింగులు, ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు సమగ్ర విచారణ చేపట్టి న్యాయం జరిగేలా పని చేయాలని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ వేగంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-100 కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రాచలంలో జరగబోయే శ్రీ రామనవమి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని దొంగతనాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలకు బారిన పడకుండా నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించకూడదని ఎస్పీ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ రాము, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ అశోక్, ఏవో మంజ్యా నాయక్, సీఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే 'రైతు బంధు' ఇచ్చేవారు. ఇప్పుడు పంటలు కోతలకు వచ్చినా దిక్కులేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. రైతులకు వెన్నుపోట్లు.. రాహుల్ గాంధీకి రూ.వెయ్యి కోట్లా? ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాడే లేదు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గుజరాత్ తీరం చేరిన ఎల్పీజీ నౌక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 16: పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్‌లో నెలకొన్న వంట గ్యాస్ కష్టాలకు కాసింత తెరపడనుంది. గ్యాస్ కోసం తిప్పలు పడుతున్న కోట్లాదిమందికి ఊరటనిస్తూ భారీ లోడుతో ఎల్పీజీ ట్యాంకర్ శివాలిక్ సోమవారం గుజరాత్ తీరానికి చేరుకుంది. 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటిన శివాలిక్ నౌక ముద్రా పోర్టుకు రావడంతో అధికారులతో పాటు భారత ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. ఇజ్రాయేల్, అమెరికా దాడులతో హర్మూజ్ జల సంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించిన ఇరాన్.. భారత నౌకలను మాత్రం అనుమతిస్తోంది. ఇండియా తమకు దోస్త్ అని పేర్కొన్న ఇరాన్ విదేశాంగ మంత్రి ఎల్పీజీ ట్యాంకర్లను వదిలేందుకు అంగీకరించారు. దాంతో, భారీ ఎల్పీజీ లోడుతో ఉన్న శివాలిక్ ట్యాంకర్ మార్చి 14న సురక్షింతగా హర్మూజ్ జలసంధిని దాటింది.పలు ప్రాంతాల్లో గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్న భారతీయులకు రిలీఫ్‌నిస్తూ సోమవారం గుజరాత్‌లోని ముద్ర తీరానికి ఈ నౌక చేరుకుంది. మరో ఒకటి రెండు రోజుల్లోనే నందా దేవి నౌక కూడా భారీగా ఎల్పీజీ లోడుతో ఇండియాకు రానుందని ఓడరేవుల శాఖ ప్రత్యేక సెక్రటరీ రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు.

విశ్వ వీక్షణం

సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. "కరోనా" ఉపద్రవ కాలంలో ఆయన రచించిన అనిమేష దీర్ఘకవితా సంపుటికి వచన కవిత్వం విభాగంలో ఈ అవార్డు లభించింది.



బందారంలో విరిసిన మందారం... నందిని సిధారెడ్డి

'అనిమేష'కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

అభినందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. సిద్ధారెడ్డికి అవార్డు పట్ల అక్షరలోకం హర్షం

కత్తుల లక్ష్మారెడ్డి, సిద్దన్నపేట

డాక్టర్ నందిని సిధారెడ్డి స్వగ్రామం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం.1955 డిసెంబర్ 6 వ తేదీన ఆయన జన్మించారు. తండ్రి బాల సిద్ధారెడ్డి, తల్లి రత్నమాల. భార్య మల్లీశ్వరి, కూతురు వీక్షణ. నందిని సిధారెడ్డి పాఠశాల విద్యను బందారం, వెల్కటూరు, దుద్దెడలో చదివారు. ఇంటర్, సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యను అభ్యసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎం. ఏ. తెలుగు చదివారు. ఆధునిక తెలుగు కవిత్వంలో సూర్యుడు అనే అంశం పై 1981లో ఎం.ఫిల్ చేశారు. "ఆధునిక కవిత్వం వాస్తవికత అధివాస్తవికత " అనే అంశం పై ఉస్మానియా యూనివర్సిటీ నుండి పీ హెచ్ డీ చేసి డాక్టరేట్ పట్టా పొందారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఆయన ఈ ఘనతను సాధించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి మెదక్, సిద్దిపేట డిగ్రీ కళాశాలల్లో తెలుగు లెక్చరర్ గా పనిచేశారు. కామారెడ్డి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గా కొంత కాలం పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కోసం ప్రిన్సిపాల్ బాధ్యతల నుండి తప్పుకున్నారు. తిరిగి సిద్దిపేట డిగ్రీ కళాశాలలో లెక్చరర్ గా బాధ్యతలు చేపట్టారు. మరోవైపు తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్నారు. సిధారెడ్డి తండ్రి బాల సిద్ధా రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని రజాకార్లకు వ్యతిరేకం గా ఉద్యమించాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు కలిగిన తన తండ్రి నర్ర బాల సిద్ధారెడ్డి ప్రభావం నందిని సిధారెడ్డిపై పడింది. తండ్రి నర్ర బాల సిద్ధారెడ్డి నుంచి వామపక్ష ఉద్యమ స్ఫూర్తిని పొందారు.

తొమ్మిదవ తరగతి నుంచి కవిత్వంపై ఆసక్తి

ప్రాథమిక విద్యార్థి దశ నుండే సిధారెడ్డికి సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. తొమ్మిదో తరగతి చదువుతున్న రోజుల్లోనే పద్య కవిత్వంపై ఆసక్తి పెంచుకున్నారు. పద్య సాహిత్య సృజన చేశారు. బాల్య దశలో కొమురవెల్లి మల్లిఖార్జున స్వామిపై మల్లిఖార్జున శతకం రాశాడు. కానీ అది అచ్చు కాలేదు. తర్వాత తెలుగు ఉపాధ్యాయుడు అష్టకాల నరసింహ స్వామి ప్రోత్సాహంతో వచన కవిత్వంపై దృష్టి మళ్లించాడు.

ఐదు దశాబ్దాల అక్షర పయనం

యాభై ఏళ్లుగా ఆయన సాహిత్య సృజన చేస్తున్నారు. సామాజిక స్పృహతో వచన కవిత్వం రాశాడు. అందులో భాగంగా మొదట భూమి స్వప్నం అనే కవితా సంపుటిని 1985 సంవత్సరంలో వెలువరించారు. అటు తర్వాత సంభాషణ, దివిటీ, ప్రాణహిత, ఒక బాధ గాదు, నది పుట్టువడి, ఇగురం, ఆవర్తనం,నాగేటి సాళ్ళల్ల,(తెలంగాణ పాటల పుస్తకం), ఇక్కడి చెట్ల గాలి, చిత్ర కన్ను, బందారం కథలు, కరోనా ఉపద్రవ కాలం నేపథ్యంలో అనిమేష అనే దీర్ఘ కవితా సంపుటిని వెలువరించారు. ఇటీవలే నాగటి తరం అనే నవలను రచించారు. ఈ నవలను స్వగ్రామం బందారంలో ఆవిష్కరించారు.

తెలంగాణ మట్టి వాసనలతో కవిత్వం

నందిని సిధారెడ్డి మొదటి నుండి అభ్యుదయ, విప్లవ భావజాలంతో సామాజిక నేపథ్యంలో కవిత్వం రాశారు.



ఆయన కవిత్వం నిండా తెలంగాణ మట్టి వాసన పరిమళిస్తుంది. మానవీయ విలువలు ప్రధానంగా ఆయన సాహిత్యం ఉంటుంది. ఆయన మొదటి నుండి తెలంగాణ వాది. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆయన రచన భూమి స్వప్నం కవిత్వానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు లభించింది. దాశరథి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, స్నేహ నిధి పురస్కారం, రంజని కుందుర్తి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ కవి పురస్కారం వంటి అనేక అవార్డులు అందుకున్నారు.

తెలంగాణ కోసం కవుల ఏకీకృతం

తెలంగాణ ఉద్యమం కోసం రాష్ట్రంలోని కవులను ఏకీకృతం చేయడంలో నందిని సిధారెడ్డి కీలక భూమిక పోషించారు. మెదక్ కేంద్రంగా మెదక్ స్టడీ సర్కిల్ ప్రారంభించారు. దీని ద్వారా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు కవులతో కలిసి 1986వ సంవత్సరంలో మంజీరా రచయితల సంఘం ప్రారంభించారు. మంజీరా రచయితల సంఘం ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అభ్యుదయ వాద కవులను ఏకీకృతం చేశారు. నందిని సిధారెడ్డి నేతృత్వంలో మంజీరా రచయితల సంఘం 1996వ సంవత్సరంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవశ్యకతను తెలియజేస్తూ తీర్మానం చేసింది. సిద్దిపేటకు చెందిన నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2001లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్ స్థాపించి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష కలిగిన సిధారెడ్డి, రాష్ట్ర ఉద్యమ నాయకుడు కేసీఆర్ తో సిద్దిపేట డిగ్రీ కళాశాలలో కలిసి చదువుకున్నారు. ఈ స్నేహం నేపథ్యంలో కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమానికి నందిని సిధారెడ్డి మద్దతు పలికారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం కోసం 1997 సంవత్సరంలోనే పాటలు రాశారు.. అందులో భాగంగా రాసిందే "నాగేటి సాళ్ళల్ల నా తెలంగాణ పాట". ఈ పాట తెలంగాణ ఉద్యమాన్ని అత్యంత ప్రభావితం చేసింది. ఇంకా అనేక పాటలూ రాశారు. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రచయితలను కవులను, కళాకారులను ఒక వేదిక పైకి తీసుకు వచ్చారు. ఈ సంకల్పంతో తెలంగాణ రచయితల వేదికను ప్రారంభించడంలో సిధారెడ్డి కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రమంతా తిరిగి తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను తెలుపుతూ సభలు సమావేశాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేశారు. కేసీఆర్ తో కలిసి కవులు, కళాకారులను తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో భాగస్వాములను చేశారు. ప్రసంగాలు చేశారు. వ్యాసాలు రాశారు. సాహిత్యం సృజించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నందిని సిధారెడ్డి సాహిత్య కృషిని గుర్తించి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. సాహిత్య అకాడమీ చైర్మన్ గా నందిని సిధారెడ్డి సమర్థవంతంగా పనిచేశారు. అనేక పుస్తకాలను సాహిత్య అకాడమీ ద్వారా ప్రచురించారు. కేసీఆర్ సారథ్యంలో నందిని సిధారెడ్డి నేతృత్వంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు నభూతో నభవిష్యత్ అన్న పద్ధతిలో జరిగాయి.

నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించడంలో నిబద్ధత

నిజాయితీ, నిబద్ధత, నమ్మిన సిద్ధాంతం పట్ల నందిని సిధారెడ్డి పూర్తి స్థాయి ఆచరణ కలిగి ఉంటారు. ఆయన

ముక్కు సూటి వ్యక్తిత్వం కలవారు. ఈ విషయాన్ని అయినా నేరుగా చెబుతారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చడం, అధికారిక ముద్రలో తెలంగాణ చిహ్నాలను తొలగించడాన్ని వ్యతిరేకించారు. వీటికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నగదు బహుమతి, 250 గజాల స్థలం ఇవ్వడానికి ప్రతి పాదన చేసినపుడు తిరస్కరించి నిబద్ధత చాటుకున్నారు. నందిని సిధారెడ్డి 50 ఏండ్ల సాహిత్య ప్రస్థానంలో ఆయన సాహిత్య కృషికి తాజాగా కేంద్ర సాహిత్య అకాడమీ నమస్కారం లభించింది. కరోనా కాలంలో ఆయన రాసిన అనిమేష అనే దీర్ఘ కవితా సంపుటిని రాశారు. కరోనా సమయంలో ప్రజల జీవన స్థితి గతులను ప్రతిబింబిస్తూ రాసిన ఈ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, బీ ఆర్ ఎస్ అధినేత కేసీఆర్, బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు హర్షం ప్రకటించారు. అభినందనలు తెలిపారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె.రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, మరసం కవులు హర్షం వెలిబుచ్చారు.

Association for Democratic Reforms

పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యేల్లో సగం మందిపై క్రిమినల్ కేసులు

- వెల్లడించిన ఏడీఆర్ రిపోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 16: పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యేలలో సగం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. ఇంకా సగం మంది కోటీశ్వరులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం 294 ఎమ్మెల్యేల్లో 291మంది నేరాలు, ఆర్థిక, ఇతర విషయాలను పరిశీలించి రూపొందించిన నివేదికను సోమవారం విడుదల చేసింది. ఇందులో 136 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు, మరో 109 మంది శాసనసభ్యులపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నట్లు పేర్కొంది. 8 మంది ఎమ్మెల్యేలపై హత్య, మరో 29 మందిపై హత్యాయత్నానికి సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని ఇందులో తెలిపారు. 22 మంది ఎమ్మెల్యేల్లో ఒక రేప్ కేసు సహా మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇక పార్టీల ప్రకారం చూసుకుంటే 223 తృణముల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 92 మంది (41 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అదే 64 మంది బీజేపీ ఎమ్మెల్యేల అఫిడవిట్లు పరిశీలించగా అందులో 42మందిపై నేరారోపణలు ఉన్నాయి. మరోవైపు నేరాలతో పాటు శాసనసభ్యుల ఆస్తులను ఏడీఆర్ నివేదిక పేర్కొంది. 291 మందిలో దాదాపు 152మంది (52 శాతం) ఎమ్మెల్యేలు కోటీశ్వరులని ఏడీఆర్ పరిశీలనలో తేలింది. మొత్తం ప్రస్తుత శాసనసభ్యుల ఆస్తుల విలువ సుమారు రూ. 821.50 కోట్లు ఉంటుందని వెల్లడించింది. సగటున ఒక ఎమ్మెల్యే ఆస్తుల విలువ రూ. 2.82గా లెక్కగట్టింది. ఈ జాబితాలో బంగీపుర్ ఎమ్మెల్యే జాకీర్ హుస్సేన్ రూ. 67 కోట్లతో తొలి స్థానంలో ఉన్నారు. కస్బా ఎమ్మెల్యే అహ్మద్ జావేద్ ఖాన్ రూ. 32 కోట్లు, జోరసాంకో ఎమ్మెల్యే వివేక్ గుప్తా రూ. 31 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు.

దీదీని ఓడించడమే లక్ష్యం

- బీజేపీ ఫస్ట్ లిస్ట్.. రెండు స్థానాల్లో సువేందు పోటీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 16: బెంగాల్ ఎన్నికలలో అధికార టీఎంసీపై ఒత్తిడి పెంచే పవర్ ఫుల్ వ్యూహాన్ని కమలదళం అమలు చేస్తోంది. ఈక్రమంలోనే సోమవారం విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారికి ఏకంగా రెండు సీట్లను కేటాయించింది. ఆయనకు నందిగ్రామ్, భవానీపుర్ అసెంబ్లీ స్థానాలను కేటాయించింది. సీఎం మమతా బెనర్జీని బలంగా ఎదుర్కొనేందుకు, వీలైనంత ఒత్తిడిని పెంచేందుకు ఆమెపైనే పోటీకి దింపారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో సువేందు అధికారి చేతిలో మమత ఓడిపోయారు. టీఎంసీ ఎమ్మెల్యే రాజీనామాతో భవానీపుర్‌లో జరిగిన బైపోల్‌లో పోటీచేసి దీదీ గెలిచారు. ఈనేపథ్యంలో ఈసారి పోల్స్‌లో భవానీపుర్ స్థానంలోనూ మమతపై సువేందు అధికారి పోటీ చేయనున్నారు. సిట్టింగ్ స్థానం కావడంతో నందిగ్రామ్‌నూ ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు. మమతను ఓడించగల పార్టీ, బంగాల్‌కు రాజకీయ ప్రత్యామ్నాయాన్ని చూపగల పార్టీ బీజేపీయే అనే సందేశాన్ని జనంలోకి తీసుకెళ్లేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే, నందిగ్రామ్ స్థానంలో 1,956 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి, విపక్ష నేత సువేందు అధికారి చేతిలో సీఎం మమతా బెనర్జీ (టీఎంసీ) ఓడిపోయారు. కానీ ఆ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక అసెంబ్లీ సీట్లను గెల్చుకొని అతిపెద్ద రాజకీయ పార్టీగా టీఎంసీ అవతరించింది. మమత ముఖ్యమంత్రి కావాలంటే, ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలి. మమతకు అవకాశం ఇవ్వడం కోసం భవానీపూర్ టీఎంసీ ఎమ్మెల్యే శోభందేబ్ ఛటోపాధ్యాయ రాజీనామా చేశారు. ఆ స్థానంలో జరిగిన ఉప ఎన్నికలో పోటీచేసి దీదీ గెలిచారు. ఈ బై పోల్‌లో దీదీకి సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ప్రియాంక టిబ్రేవాల్‌పై 58,832 ఓట్ల భారీ మెజారిటీ వచ్చింది. అంతకుముందు టీఎంసీ తరఫున గెలిచిన శోభందేబ్ ఛటోపాధ్యాయకు 28వేల ఓట్ల మెజారిటీయే వచ్చింది. అంటే మమత మెజారిటీ డబుల్ అయ్యింది. ఆ బై పోల్‌లో మమతా బెనర్జీకి 84,709 ఓట్లు రాగా, ప్రియాంక టిబ్రేవాల్‌కు 26,320 ఓట్లు వచ్చాయి. ఈసారి భవానీపూర్ స్థానంలోనూ మమతను మళ్లీ సువేందు అధికారి ఢీకొనబోతుండటం చర్చనీయాంశంగా మారింది.



గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ గ్యాస్

- పెట్రోల్, డీజిల్‌కూ కొరత లేదు : కేంద్రం ప్రకటన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 16 : దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందని, త్వరలోనే గ్యాస్ సిలిండర్ ధర రూ.2,000 దాటుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ ప్రచారానికి తెరదించేందుకు కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లు అందుబాటులో ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా తగినంతగా అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టంచేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హోర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని వెల్లడించింది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆగిపోయిన అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని పేర్కొంది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని తెలియజేసింది.



సిన్నర్, సబలెంకాకు టైటిల్

ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ అయిన ఇండియన్ వెల్స్ సింగిల్స్ టైటిల్స్‌ను యానిక్ సిన్నర్ (ఇటలీ), అరీనా సబలెంకా (బెలారస్) సొంతం చేసుకున్నారు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో రెండో సీడ్ సిన్నర్.. 76 (8/6), 76 (7/4)తో డానిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించి తన కెరీర్‌లో తొలి ఇండియన్ వెల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. తద్వారా అతడు ఆరు ఏటీపీ మాస్టర్స్ 1000 హార్డ్ కోర్ట్ టైటిల్స్‌ను గెలిచినవారిలో జొకోవిచ్, ఫెదరర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా టైటిల్ దక్కని టాప్ సీడ్ సబలెంకా.. ఆదివారం నాటి పోరులో మాత్రం ఆ గండాన్ని అధిగమించింది. ఫైనల్‌లో ఆమె.. 36, 63, 76 (8/6) ఎలీనా రిబాకినా (కజకిస్థాన్)ను చిత్తుచేసి ఇటీవలే ముగిసిన ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో తనకు ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవడంతో పాటు తొలి ఇండియన్ వెల్స్ టైటిల్‌నూ నెగ్గింది.

ఐసీసీ ట్రోఫీని ఎత్తుకొస్తారా..?

- ఇంతకంటే దిగజారాలా?
- నఖ్వీపై మండిపడ్డ సీనియర్ పాక్ క్రికెటర్

బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ 21 తేడాతో కోల్పోయిన విషయం తెలిసిందే. మీర్పూర్‌లో ఆదివారం జరిగిన మూడో వన్డేలో పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా సెంచరీ కొట్టినా.. ఆ మ్యాచ్‌లో పాక్ 11 రన్స్ తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు జట్టు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సెలెక్టర్‌గా పనిచేసిన కమ్రాన్ అక్మల్ పాక్ జట్టుపై విరుచుకుపడ్డారు. పాక్ పరిస్థితి మరీ దారుణంగా తయారైందని, ఇప్పుడు పాక్‌తో ఆడేందుకు నెదర్లాండ్స్ కూడా ఆసక్తిగా ఉందని, మనల్ని ఓడించి ఆ జట్టు టెస్ట్ హోదా సంపాదిస్తుందని, పాక్ క్రికెట్ పరిస్థితి ఇంత దారుణంగా మారిందని అక్మల్ విమర్శించారు. మూడో వన్డేలో బంగ్లాదేశ్ ఈజీగా 350 స్కోర్ చేసేదని, కానీ ఆ జట్టు కేవలం 290 మాత్రమే చేసిందని, లింటన్ దాస్ నెమ్మదిగా ఆడాడని, అయినా మనం మ్యాచ్ కోల్పోయామని విమర్శించారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోషిన్ నఖ్వీపై అక్మల్ తీవ్ర విమర్శలు చేశారు. ఆసియాకప్‌లో ఇండియా గెలిచినా.. ఇంకా ఆ ట్రోఫీని భారత్‌కు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆ ట్రోఫీ ప్రస్తుతం నఖ్వీ ఆఫీసులో ఉన్న విషయం తెలిసిందే. ప్రత్యర్థులను మ్యాచుల్లో ఓడించకుంటే, ఐసీసీ ట్రోఫీని ఇంటికి ఎత్తుకొస్తారా అని అక్మల్ పరోక్షంగా పాక్ బోర్డును విమర్శించారు. ఓ టీవీ చర్చలో పాల్గొన్న అక్మల్ తీవ్ర స్థాయిలో పాక్ బోర్డు తీరును ఖండించారు. ఫస్ట్ వన్డేలో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. రెండో వన్డేలో పాక్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విజయం సాధించింది. ఇక కీలకమైన మూడో వన్డేలో 11 రన్స్ తేడాతో పాక్ ఓడింది.

గేల్ రికార్డ్ బద్దలు కొడుతా

- వైభవ్ సూర్యవంశీ

యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉన్న అరుదైన ఐపీఎల్ రికార్డును బద్దలు కొడుతానని టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ అన్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ రికార్డ్ క్రిస్ గేల్ పేరిట ఉంది. అతను ఐపీఎల్ 2013 సీజన్‌లో పుణె వారియర్స్ ఇండియాపై ఆర్‌సీబీ తరఫున 66 బంతుల్లో 175 పరుగులు చేశాడు. గత 13 ఏళ్లుగా ఈ రికార్డు చెక్కు చెదరకుండా ఉంది. అయితే ఈ రికార్డును అధిగమించడమే తన లక్ష్యమని వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. న్యూఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన బీసీసీఐ నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో వైభవ్ ఈ విషయాన్ని వెల్లడించాడు. హోస్ట్ హర్ష భోగ్లే.. వైభవ్‌కు మూడు ఆప్షన్స్ ఇచ్చాడు. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు, ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేయడం, క్రిస్ గేల్ 175 పరుగుల రికార్డును అధిగమించడం.. వీటిల్లో ఏది టార్గెట్? అని అడిగారు. దానికి వైభవ్ స్పందిస్తూ.. 'క్రిస్ గేల్ చేసిన 175 రన్స్ రికార్డును అధిగమించడం' అని బదులిచ్చాడు. రాజస్థాన్ రాయల్స్ కప్ అందించడం కూడా తన లక్ష్యమని వైభవ్ వెల్లడించాడు. అయితే తాను ఎప్పుడూ గేమ్ పైనే ఫోకస్ చేస్తానని, బయట జరిగే చర్చ గురించి ఆలోచించనని స్పష్టం చేశాడు. 'నేనేం చేయగలనో దానిపై దృష్టి పెడతా. మైదానంలో బాగా ఆడితే ఆటోమేటిక్‌గా మనపై అందరి అటెన్షన్ ఉంటుంది. ఒకవేళ సరిగ్గా ఆడకపోయినా ఏవో మాటలు అంటారు. కానీ, నేనెప్పుడూ వాటిని పట్టించుకోను. నా ఆట పైనే ఫోకస్ చేస్తా. తొలిసారి నేను అండర్ 19 ప్రపంచకప్ ఆడా. ఫైనల్లో సెంచరీ చేయడం గర్వంగా ఉంది. జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో నావంతు భాగస్వామ్యం అందించగలిగాను. అలాగే రాజస్థాన్ రాయల్స్‌కు కప్ అందించాలి. ఈ ఏడాది నా లక్ష్యాల్లో అదొకటి. అంకితభావంతో పనిచేస్తే సక్సెస్ వస్తుందని నమ్ముతా' అని వైభవ్ తెలిపాడు.

వన్డే వరల్డ్ కప్ మా తదుపరి లక్ష్యం: శుభ్‌మన్ గిల్

ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 గెలవడమే తమ తదుపరి లక్ష్యమని టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచినప్పటికీ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి తృటిలో కప్‌ను చేజార్చుకుంది. న్యూఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన బీసీసీఐ నమన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న శుభ్‌మన్ గిల్.. తమ తదుపరి లక్ష్యం గురించి వెల్లడించాడు. 'వన్డే ప్రపంచకప్ గెలవడం మా తదుపరి లక్ష్యం. గత ఫైనల్లోనే మేం తృటిలో టైటిల్ కోల్పోయాం. సౌతాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027 మాకు మరో అవకాశం. ఏ ఫార్మాట్‌లోనైనా దేశం కోసం ప్రపంచకప్‌ను గెలవడం మా ప్రధాన లక్ష్యం. ఈ ఆలోచన ఎప్పుడూ నా మనసులో తిరుగుతూనే ఉంటుంది.' అని శుభ్‌మన్ గిల్ పేర్కొన్నాడు. మరోవైపు భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మళ్లీ ఆడాలని ఉందా? అని ప్రశ్నించగా.. ఖచ్చితంగా అని బదులిచ్చాడు. 'అహ్మదాబాద్‌లో జరిగిన 2023 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను మళ్లీ ఆడి విజయం సాధించాలనే నేను కోరుకుంటాను.' అని సూర్య తెలిపాడు.

‘ఉస్తాద్ భగత్ సింగ్’లో వింటేజ్ పవర్ స్టార్‌ని చూస్తారు

కథానాయిక రాశి ఖన్నా

‘గబ్బర్ సింగ్’ వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాశి ఖన్నా, శ్రీలీల కథానాయికలు. దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. మార్చి 19వ తేదీన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక రాశి ఖన్నా సినిమా విశేషాలను పంచుకున్నారు.

ఈ ప్రాజెక్ట్‌లోకి ఎలా వచ్చారు?

నా జీవితం ఇప్పుడు చాలా బిజీగా ఉంది. నిజం చెప్పాలంటే, పవన్ కళ్యాణ్ గారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఎంతో ఉత్సాహంతో వెంటనే ఓకే చెప్పేశాను. నేను నా మొదటి సినిమా చేస్తున్నప్పటి నుంచే, పవన్ కళ్యాణ్ గారి స్టార్డమ్ గురించి, పవనిజం గురించి విన్నాను. అప్పుడే ఆయనతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలి అనుకున్నాను. 'ఉస్తాద్ భగత్ సింగ్'తో నా కల నెరవేరింది.

ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?

నా పాత్ర పేరు శ్లోక. తను చాలా మోడరన్ అమ్మాయి. సినిమాలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంది. నా పాత్రకు కూడా మంచి క్యారెక్టరైజేషన్ ఉంటుంది. నాకు ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి, ఆ సాంగ్ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను.

కళ్యాణ్ గారితో పని చేసిన అనుభవం ఎలా ఉంది?

పవన్ గారు చాలా సింపుల్ పర్సన్, ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలో ఒక తెలియని అమాయకత్వం ఉంది. మీరు నటి కావాలని ముందే అనుకున్నారా? అని మొదటిరోజే నన్ను అడిగారు. లేదు సార్, నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నానని ఆయనతో చెప్పాను. ఆయన తక్కువ మాట్లాడతారు.. కానీ, ప్రతి మాటలో విలువ ఉంటుంది. నాతో ప్రజా సేవ చేయమని చెప్పారు. పవన్ గారు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. .

దర్శకుడు హరీష్ శంకర్ గురించి ఏం చెప్తారు?

హరీష్ శంకర్ గారు చాలా స్మార్ట్. ఆయనకు మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను ఆయన కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సరిగా నిద్ర కూడా పోకుండా సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. .

ఇద్దరు హీరోయిన్లు (శ్రీలీల, మీరు) ఉండటం వల్ల స్క్రీన్ స్పేస్ తగ్గుతుందని అనిపించలేదా?

మా ఇద్దరికీ కలిసి సన్నివేశాలు లేవు. ప్రతి పాత్ర దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. నా పాత్రలో కూడా మంచి వేరియేషన్స్ ఉంటాయి.

'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ఎలా ఉండబోతుంది?

'గబ్బర్ సింగ్' లాగే ఈ సినిమా కూడా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇది ఒక ఫ్యామిలీ సినిమా, అందరూ కలిసి థియేటర్‌లో చూడొచ్చు. ఉగాది పండుగ సమయంలో వస్తున్న ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. వింటేజ్ పవన్ కళ్యాణ్ గారిని చూస్తారు.

మీ భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి చెప్పండి?

ప్రస్తుతం హిందీలో అక్షయ్ కుమార్ గారితో ఒక సినిమా, 'ఫర్జీ 2' షో చేస్తున్నాను. అమెజాన్ సిరీస్ లో ఒక పంజాబీ పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను, అందులో నా డైలాగ్స్ అన్నీ పంజాబీలోనే ఉంటాయి. తమిళ్ లో 'రౌడీ అండ్ కో' చేస్తున్నాను. తెలుగులో కూడా కొన్ని కథలు వింటున్నాను.

‘నాగబంధం’ నమో రే.. పాట రిలీజ్

'నాగబంధం' నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన “నమో రే” పాట విడుదలైంది. దర్శకుడు అభిషేక్ నామా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ అన్నపరెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, కళాత్మక సంపదను ప్రతిబింబించేలా రూపొందుతోంది. తాజాగా విడుదలైన “నమో రే” పాట భక్తి యుగానికి శ్రీకారం చుట్టింది. శ్రీమహా విష్ణువుకు అంకితంగా రూపొందిన ఈ పాట భక్తి, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతిని అద్భుతంగా చూపించింది. ఈ సాంగ్‌కు జునైద్ కుమార్, అభే అద్భుతమైన మ్యూజిక్ అందించారు. క్లాసికల్ టచ్‌తో పాటు మోడరన్ మ్యూజిక్ స్టైల్‌ను కలిపి గొప్ప అనుభూతిని ఇచ్చారు. శ్రీహర్ష ఈమని లిరిక్స్ లో భక్తి భావం అద్భుతంగా వినిపిస్తుంది. గాయకులు సింధుజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి పాడిన విధానం పాటకు మరింత బలాన్ని ఇచ్చింది. స్క్రీన్‌పై చూసిన వెంటనే ప్రేక్షకులు నిజమైన ఆలయంలోకి వెళ్లినట్టుగా అనిపించే ఫీల్ ఇస్తుంది. సినిమాలో ఇది అత్యంత ప్రత్యేకంగా నిలిచే క్రియేటివ్ హైలైట్‌లలో ఒకటిగా నిలవనుంది.





కొంటె చూపుతో...

చివరిగా డార్లింగ్ సినిమాలో నటించిన నభా నటేష్.. 2022 తర్వాత మళ్లీ ఇండస్ట్రీలో కనిపించలేదు.. కారణం యాక్సిడెంట్.. ఈ యాక్సిడెంట్ తర్వాత మళ్లీ కోలుకున్న ఈమె ఇప్పుడు మళ్లీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఏకంగా రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా మారింది. అలా స్వయంభు, నాగబంధం చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. త్వరలో స్వయంభూ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో మరొకవైపు తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.. అందులో భాగంగానే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న నభా నటేష్ మరోసారి గ్లామర్ టచ్ తో సోషల్ మీడియాను హీటెక్కించింది.

‘విశ్వనాథ్ అండ్ సన్స్’ ఆకట్టుకుంటున్న టీజర్

సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘విశ్వనాథ్ & సన్స్’ సినిమా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ద్వారా సంజయ్ విశ్వనాథ్ అనే పాత్ర యొక్క ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం భావోద్వేగాలతో నిండిన, ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించనుందని టీజర్ చూస్తే తెలుస్తోంది. టీజర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను చూపించారు. 40 ఏళ్ల వయసులో కూడా తన కలలను వదలకుండా ముందుకు సాగుతున్న వ్యక్తిగా అతడిని పరిచయం చేశారు. సూర్య ఈ సినిమాలో తండ్రి ప్రేమ, భావోద్వేగ లోతు రెండూ కలిసిన ఒక గాఢమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన తెరపై కనిపించిన తీరు, వెంకీ అట్లూరి రాసిన ప్రభావవంతమైన సంభాషణలు.. సూర్య సినీ ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోయిన అద్భుతమైన ప్రదర్శనలను గుర్తు చేస్తున్నాయి. కథకు కొత్తదనాన్ని జోడించే పాత్రలో మమితా బైజు కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో ఉత్సాహం, చురుకుదనం తీసుకొస్తుందని టీజర్ సూచిస్తోంది. వయస్సు అంతరం ఉన్న అసాధారణ ప్రేమకథను కూడా ఈ సినిమా చూపించబోతున్నట్టు టీజర్‌లో చూచాయగా తెలిపారు. సున్నితమైన భావోద్వేగాలతో అందమైన కథ చెప్పడం వెంకీ అట్లూరి శైలి. తనదైన ప్రత్యేక శైలి రచనతో.. ఈ అంశాన్ని కూడా లోతుగా, భావోద్వేగ పరిపక్వతతో మధురానుభూతిని కలిగించేలా చూపిస్తారు అనడంలో సందేహం లేదు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200